



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 240 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 21-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00



## చొరబాటుదారులకు అండగా మమత

- బెంగాల్లో మహా జంగిల్ రాజ్
- విరుచుకు పడ్డ ప్రధాని మోదీ

**కోల్‌కతా**

తృణమూల్ కాంగ్రెస్ సారథ్యంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చొరబాటుదారులను కాపాడుకునేందుకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, బెంగాల్‌లో చొరబాటుదారులకు టీఎంసీ ప్రాపకం లభిస్తోందని విమర్శించారు. తహెర్‌పూర్‌లో శనివారంనాడు జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఫోనులో ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ 'మహా జంగిల్ రాజ్'కు బీజేపీ చరమగీతం పాడుతుందని చెప్పారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్రాన్ని ఏలుతున్నాయని ఆరోపించారు. 'వాళ్లు బీజేపీని ఎంత గట్టిగానైనా వ్యతిరేకించనీయండి. కానీ పశ్చిమబెంగాల్ అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారో నాకయితే అర్థం కావడం లేదు. మీరు మోదీని వ్యతిరేకించండి, కానీ ప్రజల సంతోషాన్ని అడ్డుకోకండి. ప్రజల హక్కులను కాలరాయకండి. వారి కలలను చెల్లాచెదురు చేసే పాపానికి ఒడికట్టకండి. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వమని పశ్చిమబెంగాల్ ప్రజలకు ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను'

-మిగతా 2 లో



# ఇతర మతాలను కించపరిస్తే శిక్షిస్తాం

## అసెంబ్లీలో చట్టాన్ని తెస్తాం

- అన్ని మతాలను సమానంగా గౌరవించాలి
- మైనారిటీల సంక్షేమ పథకాలు ఎవరి భిక్షకాదు..వారి హక్కు
- క్రిస్టియన్, ముస్లిం శ్మశానవాటికల సమస్యలు పరిష్కరిస్తాం
- క్రిస్‌మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- పాల్గొన్న మంత్రులు, ఉన్నతాధికారులు, క్రిస్టియన్ పెద్దలు

**హైదరాబాద్ డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాష్ట్రంలో అన్ని మతాలను గౌరవిస్తూ, అందరికీ సమాన అవకాశాలు కల్పించటమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎవరి మతాన్ని వారు ఆచరిస్తూనే ఇతర మతాలను గౌరవించాలని సూచించారు. ఎవరైనా ఇతర మతాలను కించపరుస్తూ మాట్లాడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు అసెంబ్లీలో చట్టాన్ని తెస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో క్రిస్‌మస్ వేడుకలను ఘనంగా నిర్వహించా

-మిగతా 2 లో



## జాబ్ క్యాలెండర్ ఉండాల్సిందే

- ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు
- లేకుంటే యువత భవిష్యత్ దెబ్బతింటుంది
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్ డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు ప్రణాళికతోనే

-మిగతా 2 లో



## సిరియాపై అమెరికా భారీ వైమానిక దాడులు

- ఇది యుద్ధం కాదు ప్రతీకారం : ట్రంప్


**వాషింగ్టన్ :**

సిరియాపై అమెరికా వైమానిక దాడులు చేసింది. ఎఫ్15, ఎఫ్ 16, ఎ10 వంటి యుద్ధ విమానాలతో విధ్వంసం సృష్టించింది. ఈ దాడులను అమెరికా అధ్యక్షులు ట్రంప్ నిర్ధారించారు. ఇటీవల సిరియాలోని పామిరా నగరంలో ఇద్దరు అమెరికన్ సైనికులను ఐసిస్ హతమార్చింది. అనంతరం సిరియాలోని ఐసిస్ (ఐఎస్ఐఎస్) కు చెందిన 70కు పైగా కార్యాలయాలు, ఆయుధ డంప్‌లపై భారీ దాడులు చేసింది. "సిరియాలో ధైర్యవంతులైన అమెరికన్ దేశభక్తులను ఐసిస్ దారుణంగా హత్య చేసినందున.. దానికి కారణమైన హంతక ఉగ్రవాదులపై నేను వాగ్దానం చేసినట్లుగానే అమెరికా చాలా తీవ్రమైన ప్రతీకారం తీర్చుకుంటుందని నేను ప్రకటిస్తు న్నాను' అని ట్రంప్ శుక్రవారం తన ట్రూత్ సోషల్‌లో తెలిపారు. ఈ దాడులను సిరియా విదేశాంగ మంత్రిత్వశాఖ కూడా ధృవీక రించింది.

-మిగతా 2 లో

## ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

- అప్రమత్తంగా ఉండాల్సిందే
- ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జన్నార్



**హైదరాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఏపీకే ఫైల్స్, ఓటీపీ, బ్యాంక్ ట్రాన్సిషన్ పై అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బయట రాష్ట్రాల్లో ఉండి నిందితులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వేరొక స్టేట్స్ లో ఉన్న నిందితుల్ని గుర్తించడం, డబ్బును రికవరీ చేయడం కష్టంగా మారింది. ఈ సైబర్ మోసాల కారణంగా

-మిగతా 2 లో



## నేనైతే రేవంత్‌తో ఫుట్‌బాల్ ఆడుకుంటా

- రేవంత్ ఎవరితో ఫుట్‌బాల్ ఆడినా అక్కర్లేదు
- రేవంత్ లాగా చిల్లర రాజకీయాలు చేయను
- కాంగ్రెస్‌లో ఓ కాలు..బిజెపిలో ఓ కాలు పెట్టింది రేవంతే
- మీడియా చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రేవంత్.. ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటాడో నాకు తెలియదు... నేను మాత్రం రేవంత్ రెడ్డిని ఫుట్‌బాల్ ఆడుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రేవంత్ ఇంట్లోని మహిళలను, పిల్లలను, మనువడి గురించి నేను మాట్లాడను. రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబ సభ్యుల విషయంలో నేను చిల్లర రాజకీయాలు చేయనన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ కు హనీమూన్ ముగిసింది. ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తారు .కేసీఆర్ ఆదివారంఅన్ని విషయాలపై దిశానిర్దేశం చేస్తారని అన్నారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ మరోసార్గి ÷ర్ అయ్యారు. రేవంత్ రెడ్డి

-మిగతా 2 లో

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఉత్కంఠ

## బీఆర్ఎస్‌లోనే ఉంటే ....నేటి ఎల్పీ సమావేశానికి వస్తారా?



- పార్టీ మారినట్టు ఆధారాల్లేవన్న స్పీకర్
- బీఆర్ఎస్ శాసనసభ్యులేనని చెప్పిన సీఎం
- అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు అంగీకరించారు : కేటీఆర్
- నేడు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్యవర్గం కూడ
- భవిష్యత్ కార్యాచరణపై కేసీఆర్ దిశానిర్దేశం

**హైదరాబాద్ డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బీఆర్ఎస్ఎల్పీ, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం ఆ పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరగనుంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు కేసీఆర్ శనివారం మధ్యాహ్నమే నందినగర్‌లోని నివాసానికి చేరుకున్నారు. అయితే ఫిరాయింపు ఎమ్మెల్యేలపైనే ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ

-మిగతా 2 లో



## బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు

- అందుకే అవినీతి కేసుల్లో విచారణలు పక్కదారి
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లపై కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన.. అవినీతి మయంగా, దరిద్రంగా ఉందని ఆయన ధ్వజమెత్తారు. తల నరికినా.. పైసా లేదని సీఎం రేవంత్ అంటున్నారని.. అందువల్లే ఇక్కడి ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లాగే డబుల్ ఇంజిన్ సర్కారును కోరుకుంటున్నారని విమర్శించారు. ఈసారి ఎన్నికలు ఎప్పడొచ్చినా అధికారం తమదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈసారి ఎప్పడు ఎన్నికలు వచ్చినా.. తెలంగాణలో సొంతంగా

-మిగతా 2 లో

## 2029 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ

- ప్రతీ ఇంటి నుంచి చెత్త కలెక్ట్ చేసే పక్రియ
- ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యం
- స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**అనకాపల్లి, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

2029 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 86 మెట్రిక్ టన్నుల చెత్త ఉంచి పోయిందని.. అక్టోబర్ 2 నాటికి ఆ చెత్త తొలగించామని తెలిపారు. ఫిబ్రవరి 15 నాటికి ప్రతీ ఇంటి నుంచి చెత్త కలెక్ట్ చేసే పక్రియ 100 శాతం పూర్తి చేస్తామని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు.

-మిగతా 2 లో



# ఇతర మతాలను కించపరిస్తే శిక్షిస్తాం

(మొదటి తరువాయి)

రు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో మంత్రులు అజహరుద్దీన్, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ రాష్ట్రంలో మత ప్రాతిపదికన దాడులు చేసేందుకు ప్రయత్నించిన వారిని తమ ప్రభుత్వం అణచివేసిందని గుర్తు చేశారు. మైనారిటీలకు అందించే సంక్షేమ కార్యక్రమాలు ఎవరి దయాదాక్షిణ్యాలు కాదనీ, అది వారి హక్కు అని స్పష్టం చేశారు. క్రిస్టియన్, ముస్లిం స్మశాన వాటికల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. మానవ సేవే మాధవ సేవగా భావించి, ప్రేమను పంచి, శాంతిని పెంచాలనే సూక్తిని ఏసుక్రీస్తు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారని కొనియాడారు. ద్వేషించే వారిని సైతం ప్రేమించాలంటూ ఆయన మానవాళికి మంచి సందేశమిచ్చారని తెలిపారు. జీసస్ జన్మించిన డిసెంబర్ నెలలోనే కాంగ్రెస్‌పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మించారనీ, రాష్ట్రంలో



ప్రజాప్రభుత్వం కూడా ఇదే నెలలో ఏర్పడిందని గుర్తుచేశారు. ఏసు ప్రభువు బోధనల స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. క్రిస్టియన్ మిషనరీలు ప్రభుత్వంతో పోటీపడి విద్య, వైద్యాన్ని ప్రాధాన్యతగా తీసుకొని పేదలకు అందించా యని కొనియాడారు. ఎవరెన్ని విధాలుగా ఇబ్బంది పెట్టినా, తమపై ఎంత దుష్ప్రచారం చేసినా, ఓర్పు, పట్టుదలతో శాంతిని కాపాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని కల్పించామన్నారు. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ను అందించి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపామన్నారు. ఆనాడు ఆహార భద్రత చట్టాన్ని కాంగ్రెస్ తీసుకొచ్చిందనీ, ఈ రోజు అదే పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 3.10 కోట్ల మంది పేదలకు సన్న బియ్యాన్ని అందిస్తున్నామని వివరించారు. రైతు రుణమా ఫీ చేసి, సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించటం ద్వారా వ్యవసాయాన్ని పండగ చేశామన్నారు. ఆనాడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించిందనీ, దానిలోని అంశాలను అమలు చేయటం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తామని చెప్పారు. అనంతరం వేడుకలకు విచ్చేసిన చిన్నారులకు సీఎం క్రిస్మస్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేనైతే రేవంత్‌తో ఫుట్‌బాల్ ఆడుకుంటా

(మొదటి తరువాయి)

సర్కార్‌కి హనీమూన్ ముగిసిందంటూ ఆయన ఎద్దేవా చేశారు. శనివార తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సంద్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. లోకల్ బాడీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ కార్యక్రమం ఉంటుంది. కేసీఆర్ బహిరంగ సభలపై రేపటి సమావేశంలో నిర్ణయం ఉంటుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు...కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో ప్రెస్ మీట్ పెట్టి.. బీఆర్ఎస్ లోనే ఉన్నామనటం పెద్ద కామెడీగా ఉంది. పంచాయతీ ఎన్నికల విషయంలో రేవంత్ చెప్తోన్న 66శాతం నిజమైతే.. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైపోల్స్ కు రావాలి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ గా నేను ఫెయిల్ కాదు. నేను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక32జిల్లా పరిషత్, 136మున్సిపాలిటీలు గెలిచాము. రేవంత్ సీఎం అయ్యాక.. సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించలేదు. నేను ఐరన్ లెగ్ కాదు.. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలే ఐరన్ లెగ్‌లు. పంచాయతీ ఎన్నికల దెబ్బకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించరు. మొదట మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారు. అలానే గ్రేటర్‌లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదు. జీహెచ్ఎంసీని మూడు కార్పోరేషన్లు చేయాలనేది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. అయితే గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు పెట్టాలనే దానిపై కూడా సీఎంకు స్పష్టత లేదు. 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఏమీ లేదని రేవంత్ కు అర్థమైంది. రేవంత్ పాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. కాంగ్రెస్ పాలన దెబ్బకు పరిశ్రమలు ఆంధ్రకు వెళ్ళిపోతున్నాయి. విరూపాక్ష అనే కంపెనీ కర్నూలుకు వెళ్లింది. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. టైమ్ కోసం ఎదురు చూస్తున్నారు. సరైన సమయంలో కాంగ్రెస్ కు, రేవంత్ రెడ్డికి ప్రజలు సరైన తీర్పు ఇస్తారు. ఇక 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వమని చెప్పటానికి రేవంత్ ఎవరు?. మేము పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం, అసెంబ్లీ ఎన్నికల్లో 30శాతం సీట్లు బీసీలకు ఇచ్చాము.

ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు. మార్కెట్ యార్డ్ లు బీసీలకు ఇచ్చాము. అలానే విద్యా, ఉపాధిలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరని అన్నారు. అఖిలేష్ యాదవ్ తో ఫ్రెండ్లీగా ఉంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు బాధ ఎందుకన్నారు.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి మాత్రమే లోపాయికారి ఒప్పందం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ కు ఏటీంగా మారిందని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వయంగా అన్నారు. ఢిల్లీలో బీజేపీ ఎంపీ దుబే గృహప్రవేశానికి తెలంగాణ సీఎం ఎందుకు వెళ్లారో రామచంద్రరావు చెప్పాలి. ఢిల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్ళల్లో జరుగుతున్నాయో మాకు తెలుసు. దేశ రాజధాని ఢిల్లీలోని తుగ్లక్ రోడ్ లో రేవంత్ రెడ్డి ఇల్లు రీమోడల్ చేయించిందే బీజేపీ ఎంపీనే. తెలంగాణ సీఎం రేవంత్ .. ఒక కాలు కాంగ్రెస్ లో.. మరొక కాలు బీజేపీలో ఉంచారు. కిషన్ రెడ్డితో మాకు అండర్ స్టాండింగ్ ఉందని అంటున్నారు. కిషన్ రెడ్డి మాకు చేసింది ఏంటో చెప్పాలి' అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఉత్కంఠ

(మొదటి తరువాయి)

ఫిరాయింపు ఎమ్మెల్యేలు ప్రకటించారు. ఇంకోవైపు ఐదుగురు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి (గద్వాల), టి ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి) పార్టీ మారినట్టు ఎలాంటి ఆధారాల్లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈనెల 17న తీర్పును వెల్లడించారు. వారిపై ఉన్న అనర్హత పిటిషన్లను కొట్టేశారు. దీంతో వారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే పరిగణించబడతారు. మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), కాలె యాదయ్య (చేవెళ్ల), ఎం సంజయ్ కుమార్ (జగిత్యాల), దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్) అనర్హత పిటిషన్లపై త్వరలోనే తీర్పును వెల్లడించే అవకాశమున్నది. ఆ పదిమంది ఎమ్మెల్యేలు ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగే



బీఆర్ఎస్‌ఎల్పీ సమావేశానికి హాజరవుతారా? లేదా? అన్నది ఉత్కంఠగా మారింది. ఎందుకంటే ఇప్పుడు బంతి ఎమ్మె ల్యేల కోర్టులోనే ఉన్నది. బీఆర్ఎస్‌లోనే ఉన్నా మంటూ చెప్తున్నా ఆ పార్టీ కార్యక్రమాల్లో వారు పాల్గొనడం లేదు. ఇప్పుడు బీఆర్ఎస్‌ఎల్పీ సమావేశానికి హాజరు కాకుంటే పార్టీ మారినందునే రాలేదని బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేస్తుంది. దీంతో ఆ ఎమ్మెల్యేలు ఏం చేస్తారనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఆ పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు చెందిన వారేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటిం చారు. అసెంబ్లీ సమావేశాలు జరిగినపుడు స్పీకర్ బులెటిన్ విడుదల చేసినపుడు బీఆర్ఎస్ సభ్యులుగానే పరిగణించబడుతున్నారని గుర్తు చేశారు. వారిని కలుపుకుని సంఖ్య ఆధారంగా ఎక్కువ సమయం కావాలంటూ హరీశ్‌రావు స్పీకర్‌ను అడుగుతారని చెప్పారు. అయితే స్పీకర్ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను కొట్టేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వ్యాఖ్యానించింది. అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలు చాలా సార్లు బహిరంగంగా ప్రకటించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ అంశంపై తాము న్యాయ పోరాటం చేస్తామని ఆయన ప్రకటించారు.

# 2029 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ

(మొదటి తరువాయి)

ఇందులో భాగంగా తాళ్ళపాలెంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం సమయంలో ప్రధాని తనకో బాధ్యతను అప్పగించినట్లు చెప్పారు. అన్ని రాష్ట్రాల సీఎంలతో సమగ్ర చర్చ జరిపి నిర్వహణ అప్పగించారన్నారు. ఏ కార్యక్రమం అయినా ప్రజల భాగస్వామ్యంతోనే విజయాలు సాధించగలమని చెప్పుకొచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ముందుండి నడిపించేది గ్రీన్ సోల్జర్లని.. వారికి అభివాదాలు తెలియజేశారు. రీసైకిల్ ఏకానమి సృష్టించామని.. అందరి ఆరోగ్యం కోసం ఈ పని చేస్తున్నట్లు తెలిపారు. సాలిడ్ వేస్ట్ ను కంపోస్ట్ యూరియాగా మారుస్తున్నారని దీని వల్ల రైతులకు దిగుబడి పెరుగుతోందన్నారు. పారిశుద్ధ్య కార్మికులే నిజమైన సైనికులని చెప్పుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో కిచెన్ గా÷-డ్గ్న÷న్స్‌కు రూ.5లక్షలు సాయం అందిస్తామన్నారు చంద్రబాబు. వేస్ట్ ఎనర్జీ ఎ÷-లాంట్‌తో రోజు వెయ్యి టన్నుల చెత్త సేకరించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు. అక్టోబర్ 2 తర్వాత రాష్ట్రంలో సింగల్ యూస్ ఎ÷-లాస్టిక్ ఉండకూడదన్నారు. ఏ ఆఫీస్‌కు వెళ్లకుండా మొబైల్ ద్వారానే సేవలు పొందే అవకాశం తెస్తున్నామని చెప్పారు. 'నాది ఉడుంపట్టు.. వదిలి పెట్టేది లేదు' అని తేల్చి చెప్పారు. స్వచ్ఛాంధ్రలో అనకాపల్లి 13వ స్థానంలో ఉందన్న సీఎం.. ఇంకా మెరుగుపడాలని సూచించారు. అనకాపల్లి పరిశ్రమల హబ్‌గా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జిల్లాలో మొదటి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ ను 90 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అరకు కాఫీ కోసం ఆనంద్ మహేంద్ర ట్వీట్ చేశారని పేర్కొన్నారు. అనకాపల్లిలో ఆర్గానిక్ బెల్లం చేసి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా ముందుకెళ్లాలని సూచించారు. రెండు నెలల్లో పోలవరం నీళ్లు అనకాపల్లికి వస్తాయన్నారు. గోదావరి నీళ్లు వంశధారకు అనుసంధానం చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి పూర్వోదయ కింద కేంద్రాన్ని సహాయం కోరినట్లు చెప్పారు. ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తోందన్నారు సీఎం. త్వరలో అనకాపల్లి జిల్లాలో ఆర్సీలార్ మిట్టల్‌తో స్టీల్ సిటీ ఏర్పడుతుందని వెల్లడించారు. అల్యూమినియం సిటీ కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. మెడికల్ కాలేజ్‌లకు పీపీపీ కింద ఇచ్చామన్న సీఎం.. గతంలోనూ 104, 108లు ప్రైవేట్‌కే ఇచ్చారు కదా? ప్రశ్నించారు. రుషికొండను గుండు కొట్టారని విమర్శించారు. రుషికొండకు రూ.500 కోట్లు ఖర్చు చేశారని.. ఆ సొమ్ములతో మెడికల్ కాలేజ్ కట్టొచ్చన్నారు. వైసీపీ హయాంలో ఏజెన్సీని గంజాయి వనంగా మారిస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చి కాఫీవనంగా మార్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## జాబ్ క్యాలెండర్ ఉండాల్సిందే

(మొదటి తరువాయి)

వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.

## చొరబాటుదారులకు అండగా మమత

(మొదటి తరువాయి)

అని మోదీ విజ్ఞప్తి చేశారు. కాగా, వాతావరణ ప్రతికూలత కారణంగా మోదీ హెలికాప్టర్‌తహెర్‌పూర్‌లో దిగలేకపోయింది. దీంతో ఆయన కోల్‌కతా విమానాశ్రయానికి తిరిగివెళ్లిపోయారు. పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లా రణఘాట్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.3,200 కోట్లతో నిర్మించనున్న రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు కోల్‌కతాను సిలిగురితో అనుసంధానిస్తూ సుమారు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా చేస్తాయని పీఎంఓ తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం కావడంతో పాటు పర్యాటకం కూడా పెరుగుతుందని పేర్కొంది.

## సిరియాపై అమెరికా భారీ వైమానిక దాడులు

(మొదటి తరువాయి)

అంతకుముందు, అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్ 'ఐసిస్ మౌలిక సదుపాయాలు, ఆయుధ ప్రదేశాలను' లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయని ప్రకటించారు. 'ఇది యుద్ధం కాదు ఇది ప్రతీకారం' అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. అయితే ఐసిస్ ఉగ్రవాద కార్యకలాపాలను విస్తరించుకుంది. దాని పేరుతో సిరియాలో అనేక సంవత్సరాల నుండి వేలాది మంది సైనికులను అమెరికా మోహరించింది. తన సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకుని సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతూ అక్కడి చమురు, నిక్షేపాలపై ఆధిపత్యం చేస్తుందని పలువురు భావిస్తున్నారు.

## ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

(మొదటి తరువాయి)

హైదరాబాద్ ప్రజలు రోజుకు కోటి రూపాయలు నష్టపోతున్నారు. అలానే సైబర్ నేరగాళ్లు రెండు విధాలుగా నేరాలకు పాల్పడుతున్నారు. ఒకటి పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్నారు.... రెండోవది డిజిటల్ అరెస్ట్ తో మోసం చేస్తున్నారని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ తో ఎక్కువగా వృద్ధులు, రిటైడ్ ఉద్యోగులు మోసపోతున్నారు. ప్రజలు సైబర్ కేటుగాళ్లు, వాళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏమైనా అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 కి లేదా 100 కి కాల్ చేయాలన్నారు. రాబోయే పండుగలు సంక్రాంతి, క్రిస్మస్ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ఆఫర్ల పేరుతో మోసాలకు పాల్పడే అవకాశం ఉంది. ఇక మధుర నగర్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు త్వరలో చర్యలు కూడా తీసుకుంటాం. మధుర నగర్ పోలీస్ స్టేషన్ ను త్వరలోనే ప్రజలకి అనువుగా అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేస్తాం' అని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పై కూడా సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో సిట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ జరుగుతుందని, త్వరలో అన్ని వివరాలు తెలియజేస్తామని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో అన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి సిట్ కార్యాలయం విషయంలో ఆలోచన చేస్తున్నామని, ప్రస్తుతం జూబ్లీహిల్స్ పీఎస్ లోనే ఫోన్ ట్యాపింగ్ సంబంధించి విచారణ సాగుతుందని తెలిపారు. మరోవైపు ఐ బొమ్మ రవి కేసు గురించి అడిషనల్ సీపీ శ్రీనివాస్ పలు విషయాలను వెల్లడించారు. 'ఐ బొమ్మ రవి విచారణ జరుగుతుంది. సమాధానాలు చేప్పడంలేదని బయట ఊహాగానాలు వస్తున్నాయి. మా స్టైల్ లో మేము విచారణ చేస్తున్నాము. అతని నుండి సమాధానాలు రాబడుతున్నాం' అని ఆయన వెల్లడించారు.

## బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు

(మొదటి తరువాయి)

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని పదేళ్ల నుంచి అంటున్నారు. ఈ రెండు పార్టీలు ఎప్పుడూ కలిసి పోటీ చేయలేదు. కానీ, కాంగ్రెస్ పార్టీతో కలిసి బీఆర్ఎస్ బరిలో దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే.. అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను జైలుకు పంపుతానన్న రేవంత్ రెడ్డి మాటలు ఏమైయ్యానని నిలదీసారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను జైలుకు పంపారా? కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో జైలుకు పంపారా? డ్రగ్స్ కేసులో జైలుకు పంపారా? ఫాం హౌస్ కేసులో జైలుకు పంపారా? కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులు కాబట్టే కేసీఆర్ ఫ్యామిలిలో ఎవరినీ జైలుకు పంపలేదని ఇరు పార్టీలపై బండి సంజయ్ ధ్వజమెత్తారు . కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికలలో ఓడిన తర్వాత కేసీఆర్ ఎక్కడా కనబడలేదని.. అయితే ఫామ్ హౌజ్ లేదా యశోదా ఆసుపత్రిలో మాత్రమే కనిపిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఫామ్ హౌజ్ పాలను తెలంగాణ ప్రజలు కోరుకోవడం లేదన్న ఆయన.. పంచాయితీ ఎన్నికల్లో తమ పార్టీకి గతంలో 100 సీట్లు వస్తే.. ఇప్పుడు 600కు పైగా స్థానాలొచ్చాయన్నారు. లీకు వీరులు అన్ని పార్టీల్లోనూ ఉన్నారని ఈ సందర్భంగా కౌంటర్ వేశారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి పాలన అద్భుతంగా సాగుతోందని బండి సంజయ్ కొనియాడారు. 'ఏపిలో కూటమి పాలనకు వందకు వంద మార్కులు పడతాయి. ఈ విషయంలో అనుమానాలున్నవారు మూర్ఖులు. అలాంటివారు ఆసుపత్రికి వెళ్లి ట్రీట్మెంట్ తీసుకోవాలి. ఏపిలో అభివృద్ధిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది' అని కూటమి పాలనపై ప్రశంసలు కురిపించారు.

# మల్యాలపల్లిలో పెద్దపులి సంచారం
# భయాందోళనలో గ్రామస్థులు

**రామగుండం, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం మండలం మల్యాలపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో గత మూడు రోజులుగా పెద్దపులి సంచరిస్తుండడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన కత్తెరమల్ల కుమారి మేకలు మేపడానికి వెళ్లగా పొదల్లో పులి కనిపించిందని, అది మేకల మందను తరుముతుండడంతో కేకలు వేస్తూ పారిపోయానని ఆమె తెలిపింది. సమాచారం అందుకున్న అటవి శాఖ అధికారులు దేవదాస్, కొమురయ్య ఆధ్వర్యంలో గస్తీ చేపట్టి పులి పాదముద్రలను సేకరించారు.రేంజ్ అధికారి దేవదాస్ మాట్లాడుతూ పులి సంచరిస్తున్న



విషయం నిజమని, దానికి ఎలాంటి హాని చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళ ఒంటరిగా బయటకు వెళ్లకుండా, గుంపులుగా వెళ్లాలని, పశువులను అడవికి మేత కోసం పంపకూడదని, ఇంటి తలుపులు, కిటికీలు బిగించుకోవాలని, ఇంటి ముందు కోళ్లు, మేకలు ఉంచరాదని సూచించారు. రాత్రి వ్యవసాయ పనుల కోసం త్రీ ఫేస్ కరెంటు సమయాన్ని మార్చాలని అటవి శాఖ విజ్ఞప్తి మేరకు బసంతనగర్ ట్రాన్స్‌కో ఏఈ మానాల ప్రసాద్ ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిరంతర సరఫరా ఇవ్వాలని ఆదేశించారు.పులి పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని బుగ్గగుట్ట ప్రాంతానికి కూడా సంచరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. బుగ్గ రామస్వామి ఆలయానికి వెళ్ళే భక్తులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పులి రోజుకు 2030 కిలోమీటర్ల పరిధిలో తిరుగుతుందని, దట్టమైన అడవుల్లో ఎక్కడైనా ఆవాసం ఏర్పరచుకోవచ్చని, పులి కనిపిస్తే వెంటనే అటవి శాఖకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

# యాదవ చారిటబుల్ ట్రస్ట్ వాలంటీర్లకు సన్మానం





**పెద్దపల్లి, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా ప్రధాన ఆసుపత్రిలో గత మూడు నెలలుగా అంకితభావంతో సేవలందించిన యాదవ చారిటబుల్ ట్రస్ట్ వాలంటీర్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో శాలువా కప్పి సన్మానించారు.ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేసిన కే. స్వాతి, డి. సుజాత, జి. సరోజన, కె. రాజేంద్ర ప్రసాద్‌లకు వైద్య ఆరోగ్యశాఖ తరఫున అనుభవ ధృవీకరణ పత్రాలను కలెక్టర్ అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని వినూత్న కార్యక్రమాలను





రూపొందించాలని సూచించారు. సామాజిక సేవలో ట్రస్ట్ భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు.ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించిన కలెక్టర్, భవిష్యత్తు కార్యాచరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు చిలారపు పర్వతాలు సహా పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు అవసరం



**హుస్నాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: గ్రామపంచాయతీలలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని బీఎస్పీ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 12,760 గ్రామపంచాయతీలు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం 202526 ఆర్థిక సంవత్సరానికి గాను కేవలం 1500 కోట్లు రూపాయలు కేటాయించిందని, దీంతో ప్రతి పంచాయతీకి సంవత్సరానికి 10 లక్షల రూపాయల నిధులు వస్తాయని ఆయన వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి, రైతుల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నప్పటికీ, గ్రామపంచాయతీల వీధి దీపాలు, తాగునీటి పంపులకు మాత్రం వాణిజ్య రేట్లతోనే చార్జీలు వసూలు చేస్తున్నారని, యూనిట్‌కు 7 రూపాయల 10 పైసలు, పంపులకు 6 రూపాయల చార్జీలు వసూలు చేయడం వల్ల పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.చిన్న, పెద్ద గ్రామపంచాయతీలకు నెలకు 50100 కిలోవాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే పంచాయతీలు ఆర్థికంగా కోలుకుంటాయని ఆయన సూచించారు. అరకొర నిధులతో పారిశుద్ధ్యం, కార్మికుల వేతనాలు చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించి గ్రామపంచాయతీలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు అమర్చాలని ఆయన కోరారు.

# జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



**హుస్నాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ మరియు కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు జనవరి 12 నుండి జనవరి 23, 2026 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, స్పోర్ట్స్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, యూత్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, ఉమెన్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, భారత స్ఫూర్తికిరీటి పురస్కారం, నటరాజ పురస్కారం, మహానంది పురస్కారంలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సాహిత్యం, కళలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, విద్య, వైద్య, యోగా, క్రీడలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి వంటి విభాగాల్లో పనిచేస్తున్న వారు అర్హులు. దరఖాస్తులు పంపించటకు చివరి తేదీ 31 డిసెంబర్ 2025. పురస్కారాల ప్రదానోత్సవం జనవరి 25, 2026న వరంగల్‌లో జరుగుతుంది. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9100174351 ,9494400158 ఇట్లు, పురస్కారాలు నిర్వహణ కమిటీ

# యూరియా బుకింగ్ యాప్ తనిఖీ



**పెద్దపల్లి, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులు యూరియా కొనుగోలు సులభతరం చేసుకోవడానికి యూరియా బుకింగ్ యాప్ ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద మహేష్ ఫర్టిలైజర్స్ ఎరువుల షాపును ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ మాట్లాడుతూ, యూరియా లభ్యతపై రైతులు ఎటువంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లాలో యూరియా ట్రాకింగ్ యాప్ ద్వారా గత నెల రోజులుగా ఎరువుల విక్రయాలను పర్యవేక్షిస్తున్నామని, ప్రభుత్వం ఈ విధానాన్ని పరిశీలించి మరింత మెరుగ్గా యూరియా బుకింగ్ యాప్ ప్రవేశపెట్టిందని ఆయన వివరించారు. ఓలా, ఉబర్ యాప్‌లలో టాక్సీ బుక్ చేసినట్లే, రైతులు ఇంటి నుంచే యూరియా బుక్ చేసుకోవచ్చని చెప్పారు.రైతులు తమ భూమి వివరాలు, అవసరమైన యూరియా పరిమాణాన్ని యాప్‌లో నమోదు చేసుకోవచ్చని, బుక్ చేసిన బస్తాల వివరాలు, ఓటీపీ చూపిస్తే షాప్ యజమానులు యూరియా అందజేస్తారని తెలిపారు. ఈ విధానం వల్ల రైతుల సమయం వృథా కాకుండా, లైన్లలో నిలబడకుండా సరైన సమయంలో యూరియా పొందవచ్చని చెప్పారు.అవసరానికి మించి యూరియా నిల్వ చేసుకోవడం నియంత్రించవచ్చని, చిన్న రైతులకు ఎటువంటి కొరత రాకుండా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. యాప్ వినియోగంలో సమస్యలు తలెత్తితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచుల ప్రమాణ స్వీకారం



**పాలకుర్తి, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెండవ విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన పాలకుర్తి మండలంలోని 16 గ్రామ పంచాయతీల నూతన సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం జరగనుంది.ఈ మేరకు ఎంపీడీఓ శశికళ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ప్రత్యేక పాలనాధికారుల ఆధ్వర్యంలో నూతన సర్పంచులు, వార్డు సభ్యులతో మొదటి సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రమాణ స్వీకారం జరుగుతుంది. తర్వాత సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీ బాధ్యతలు అప్పగించనున్నారు. మండలంలో 16 మంది సర్పంచులు, 156 మంది వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో ఎస్.ఎల్.సి. కార్యక్రమం



**హుస్నాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో ఎస్.ఎల్.సి. కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్ & ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా 155 పైగా ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయని తెలిపారు. నర్సరీ నుండి పదో తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్న ఈ ప్రదర్శనలో సోలార్ సిస్టమ్, కాలుష్య నివారణ, మ్యాజికల్ స్క్వేర్స్, పీడియాట్రిక్ టేబుల్, భూమి పొరలు, డయాలసిస్ మిషన్, ఇంగ్లీష్, తెలుగు భాషల వ్యాకరణ అంశాలు ప్రదర్శించబడ్డాయి.కార్యక్రమంలో చైర్మన్ & ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్, సెక్రటరీ & కరస్పాండెంట్ అల్లి శైలేందర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక భరోసా



**రామగుండం, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ మల్లికార్జున్ నగర్‌లో ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్ర నష్టాన్ని చవిచూసిన కొట్టం సుజాత రాజేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నెలకంటి రాము ఆర్థిక సహాయం అందించారు. శనివారం ఆయన బాధిత కుటుంబానికి 10,000 నగదు అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, దురదృష్టవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాల బాధ వర్ణనాతీతమని, ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో బాధితుల పక్షాన నిలబడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ఆదేశాల మేరకు ఈ సహాయం అందించామని తెలిపారు. అలాగే బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను తామే తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 30వ డివిజన్ అధ్యక్షుడు పంజాల ఆంజనేయులు, వడ్ల సంఘం అధ్యక్షుడు నారాయణ, మహిళా అధ్యక్షురాలు కనకలక్ష్మి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామ్కీ, యూత్ నాయకులు బొంత వెంకటేష్, దాసరి దుర్గా, మిరిమిడి రాకేష్, గొల్ల రాజన్న, నూకల అభిషేక్, ఎరుకల సునీల్, దేవరకొండ నరసింహ చారి, పాడేటి రాములు, పాండురంగారావు, తోటపల్లి పుల్లయ్య, చీకట్ల కనకయ్య, బ్రహ్మం మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రైతులకు ఫెర్టిలైజర్ యాప్‌పై అవగాహన



**రామగుండం, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ మేడిపల్లి రైతు వేదికలో శనివారం వ్యవసాయ అధికారి కె. ప్రకాష్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్ గురించి రైతులకు వివరించారు. యాప్ ద్వారా జిల్లాలో ఎక్కడ ఏ షాప్‌లో ఎంత యూరియా స్టాక్ ఉందో తెలుసుకోవచ్చని, రైతులు ఇంటి వద్ద నుంచే యూరియా బస్తాలు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మడిపెల్లి మల్లేష్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ పాలనలో రైతులు యూరియా కోసం తెల్లవారుజామునే షాప్‌ల ముందు లైన్లలో నిలబడాల్సి వచ్చేదని, కానీ సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఆ సమస్య తొలగిపోయిందని అన్నారు. రైతులను రాజులుగా నిలబెట్టడమే ఆయన లక్ష్యమని, దళారులు మోసం చేసే అవకాశం లేకుండా యాప్ రూపకల్పన చేయడం జరిగిందని పేర్కొన్నారు. రైతులకు ఇంత చక్కని సౌకర్యాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌లకు పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొండగట్టు ఆలయ భూములు అంజన్నకే చెందాలి దీక్ష ప్రారంభం




**జగిత్యాల, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మల్యాల మండలంలోని కొండగట్టు ఆలయ భూములను ఫారెస్ట్ అధికారులు ఫారెస్ట్ భూములుగా మార్కింగ్ చేయడం ఆలయ అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తోందని స్థానిక నాయకులు ఆరోపించారు. దేవాలయం ఈవో అనుమతి లేకుండా భూముల చుట్టూ మార్కింగ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ యాగండ్ల లక్ష్మీనారాయణ, ముదిగంటి రాజారెడ్డి, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్ దీక్ష ప్రారంభించారు. ఆలయానికి చెందిన భూములను వెంటనే గుర్తించి మార్కింగ్ తొలగించాలని, గిరి ప్రదర్శన చేసేటువంటి భక్తులపై హేళన చేసే వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఫారెస్ట్ అధికారులు మార్కింగ్ చేసిన భూములను దేవాలయానికి చెందేలా చేయకపోతే దీక్షను రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర గోశాల సంపర్క ప్రముఖుడు ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి కూడా వారికి మద్దతు ప్రకటిస్తూ, ఆలయ భూములు అంజన్నకే చెందాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి పద్మాకర్, జిల్లా కోశాధికారి మామిడాల రాములు, జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి




**మంచిర్యాల, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర వ్యాప్తంగా రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర రోడ్డు రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్, అదనపు డీజీపీ మహేష్ భగవత్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జనవరి నెలలో రహదారి నియమాలు, ప్రమాదాల నివారణపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, ఆర్‌టీసీ, రవాణా శాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ, జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, వ్యాసరచన, క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని, రోడ్ సేఫ్టీ వాలంటీర్లను నియమించి ప్రజలకు నియమాలు తెలియజేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అధిక వేగం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి కారణాల వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రత సూచనలను పాటించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రమాద ప్రాంతాలను గుర్తించి సూచికలు, వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నామని, భద్రతా నియమాలు పాటించని వారి లైసెన్సులు రద్దు చేస్తున్నామని తెలిపారు. కొత్త సంవత్సరం వేడుకల దృష్ట్యా డిసెంబర్ 31న ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజావాణి వాయిదా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటన ప్రకారం, 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం ఈ నెల 22న జరగనుండటంతో, ఆ రోజు నస్పూర్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం వాయిదా పడింది. ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 29వ తేదీ నుండి యధాతథంగా కొనసాగనుంది. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం

**కరీంనగర్, డిసెంబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ, హైదరాబాద్ మరియు అలింకో సహకారంతో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం డిసెంబర్ 23న అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. అక్టోబర్ 30న జరగాల్సిన శిబిరం వర్షాల కారణంగా వాయిదా పడగా, ఇప్పుడు మళ్లీ నిర్వహించనున్నారు. బ్యాటరీ ట్రైసికిళ్లు, చేతితో నడిపే ట్రైసికిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, వాకర్లు వంటి ఉపకరణాలు అందించబడతాయి. గత ఐదు సంవత్సరాల్లో బ్యాటరీ ట్రైసికిల్, నాలుగు సంవత్సరాల్లో ఇతర ఉపకరణాలు పొందిన వారు అర్హులు కారు. అర్హులు యు.డి.ఐ.డి కార్డు, సదరం సర్టిఫికెట్, తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకువచ్చి శిబిరానికి హాజరుకావాలని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తెలిపారు.

# పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో ముందంజలో కరీంనగర్



**కరీంనగర్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మూడో దశ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన మొదటి జిల్లాగా కరీంనగర్ నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని ఎంపీడీవోలు, ఎంపీఓలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి శాఖపై సమీక్ష



**సిద్దిపేట, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యకలాపాలపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో డిపిఎం, ఏపిఎం, సీసీ తదితర అధికారులతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రతి సంఘం ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యాలను నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. శ్రీనిధి రుణాల రికవరీలో ఏపిఎంలు, సీసీలు ఉదాసీనత వైఖరిని విడనాడి, వసూళ్లపై ప్రధానంగా దృష్టి సారించాలని, నెలాఖరులోగా రికవరీ పూర్తి చేయాలని సూచించారు. సెర్ప్ కార్యకలాపాలలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, అదనపు డిఆర్డిఓ సుధీర్, శ్రీనిధి రీజనల్ మేనేజర్ మోహన్ రెడ్డి, డిపిఎంలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు

# ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు




**కరీంనగర్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
ఉన్నత విద్యలో రాణిస్తూ నైపుణ్యాలను స్వంతం చేసుకున్న యువతకు అపార అవకాశాలు ఉన్నాయని, ఆకాశమే హద్దుగా ఎదగాలంటే కృషి చేసి చదవాలని ప్రముఖ కాలమిస్ట్, విశ్రాంత ప్రధానాచార్యులు ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి సూచించారు. ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ గణిత దినోత్సవ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమలో దాగిన ప్రతిభను గుర్తించి, దానిని మెరుగుపరుచుకుంటూ లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వినయ సంపన్నతను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ గణిత శాస్త్రవేత్తలు ప్రశంసించిన బాల మేధావి శ్రీనివాస రామానుజన్ ప్రతిభను ఆయన కొనియాడారు. చదువు ఎవరి సొంతం కాదని, పేదరికం చదువుకు అడ్డంకి కాదని స్పష్టం చేశారు. శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డి. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రామానుజన్ జీవితం అందరికీ ప్రేరణ కావాలని అన్నారు. కోశాధికారి లయన్ పి. సురేందర్ మాట్లాడుతూ నేడు చదువులపై శ్రద్ధ చూపిన వారు రేపటి సమాజానికి మార్గనిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించింది.

# వెంకట్రావుపల్లి పాఠశాలలో తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల సమావేశం, పోషణ ఆహారోత్సవం




**రామడుగు, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోతల్లిదండ్రుల–ఉపాధ్యాయుల సమావేశం మరియు పోషణ ఆహారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి మేడం మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడం అత్యంత అవసరమని, తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ప్రతిరోజూ ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. పౌష్టికాహారం పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుందని ఆమె వివరించారు. సమావేశంలో ఉపాధ్యాయులు కరుణాకర్, రవీందర్, ఆంజనేయులు, అంగన్వాడీ టీచర్లు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి

**మంచిర్యాల, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాష్ట్ర వ్యాప్తంగా రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర రోడ్డు రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్, అదనపు డీజీపీ మహేష్ భగవత్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జనవరి నెలలో రహదారి నియమాలు, ప్రమాదాల నివారణపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, ఆర్‌టీసీ, రవాణా శాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ, జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీల




ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, వ్యాసరచన, క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని, రోడ్ సేఫ్టీ వాలంటీర్లను నియమించి ప్రజలకు నియమాలు తెలియజేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అధిక వేగం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి కారణాల వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రత సూచనలను పాటించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రమాద ప్రాంతాలను గుర్తించి సూచికలు, వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నామని, భద్రతా నియమాలు పాటించని వారి లైసెన్సులు రద్దు చేస్తున్నామని తెలిపారు. కొత్త సంవత్సరం వేడుకల దృష్ట్యా డిసెంబర్ 31న ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## ఎన్నికల విధులకు గైర్హాజరైన 713 మందికి షోకాజ్ నోటీసులు

**కరీంనగర్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

గ్రామపంచాయతీ ఎన్నికల విధులకు హాజరుకాని 713 మంది ఉద్యోగులకు జిల్లా విద్యాధికారి, గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారి అశ్విని తానాజీ వాకడే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 11, 14, 17 తేదీల్లో జరిగిన మూడు విడతల ఎన్నికల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్, పోలింగ్ ఆఫీసర్‌లుగా విధులు కేటాయించినప్పటికీ, సంబంధిత ఉద్యోగులు ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైనట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఎన్నికల నిర్వహణకు అసౌకర్యం ఏర్పడిందని, జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించినందుకు సీసీఏ నియమాల ప్రకారం క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోరాదో లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు.

## సెట్విన్ ఉపాధి శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి




**హుస్నాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న సెట్విన్ ఉపాధి శిక్షణ కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి సందర్శించారు. కేంద్రంలో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో హుస్నాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటు చేయబడిందని లింగమూర్తి తెలిపారు. పదవ తరగతి చదివిన 18 నుండి 45 సంవత్సరాల వయస్సు గల వారు ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నామమాత్రపు ఫీజులతో ఐదు రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల వారు అవసరమైన సర్టిఫికెట్లు సమర్పించి శిక్షణ పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

## మహిళలు మార్కెటింగ్‌లో మెలకువలు నేర్చుకొని ఆర్థిక పురోగతి సాధించాలని సూచన



**సిద్దిపేట, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మహిళలు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో మెలకువలు నేర్చుకొని ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. నాబార్డు సహకారంతో సొసైటీ ఫర్ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ పీపుల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటుచేసిన బృందాన్ని ఆమె కలెక్టరేట్‌లో పచ్చజెండా ఊపి నాసిక్‌లోని సహ్యాద్రి ఫామ్స్ పరిశీలనకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సమాఖ్య సభ్యులకు ఇది ఒక సువర్ణావకాశమని, రైతు ఉత్పత్తిదారుల సమైక్య ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో విజయం సాధించిన సహ్యాద్రి ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ అనుభవాలను క్షేత్రస్థాయిలో నేర్చుకోవాలని సూచించారు. ఆర్థికంగా ఎదగడం కోసం ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, ఎల్డీఎం హరిబాబు, అదనపు డిఆర్డిఓ సుధీర్ బాబు, డిపిఎం వాసుదేవ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణి తాత్కాలిక రద్దు .ఈనెల 22వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ హైమావతి ప్రకటించారు. ప్రజలు ఆ రోజు కలెక్టరేట్‌కు రాకూడదని, ఆ తర్వాతి సోమవారం నుండి ప్రజావాణి యథాతథంగా కొనసాగుతుందని తెలిపారు.

## ఆరేపల్లి పాఠశాలలో బాలవివాహ ముక్తి భారత్ అవగాహన




**కరీంనగర్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ అర్బన్ మండలం ఆరేపల్లి జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లో భాగంగా బాలవివాహ ముక్తి భారత్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యురాలు నాయిని స్వప్న పాల్గొని బాలవివాహం వల్ల కలిగే చట్టపరమైన, ఆరోగ్యపరమైన సమస్యలను వివరించారు. అమ్మాయి వివాహ వయస్సు 18, అబ్బాయి 21 సంవత్సరాలు పూర్తయ్యాకే పెళ్లి జరగాలని, లేదంటే అది చట్టపరంగా నేరమని స్పష్టం చేశారు. ఎక్కడైనా బాలవివాహం జరిగితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలు మొబైల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా తల్లిదండ్రులు వారితో స్నేహపూర్వకంగా ఉండి పక్కదారి పట్టకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పర్సన్ ఇన్ ఛార్జ్ బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్




**కరీంనగర్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పర్సన్ ఇన్ ఛార్జ్‌గా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఉన్న పాలకవర్గాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, కలెక్టర్ పమేలా సత్పతి కొత్తగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించి, రైతులు మరియు సహకార సంఘాలకు మరింత ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి :

కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

:నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ప్రతీక్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి మొట్టమొదట రక్తదానం చేశారు. అనంతరం పలువురు యువకులు, కార్యకర్తలు రక్తదానంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ప్రతీక్ రెడ్డి వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అని పేర్కొన్నారు. సేకరించిన రక్తం పేద ప్రజలకు ఉపయోగపడుతుందని, రక్తదానం చేయడం ద్వారా అనేక ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. నిర్వాహకులను, రక్తదాతలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మాజీ జడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాతవాహన యూనివర్సిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**కరీంనగర్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

శాతవాహన యూనివర్సిటీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్ అన్నారు. యూనియన్ అధ్యక్షుడు మూలుకల దేవేందర్ అధ్యక్షతన జరిగిన కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు నుండి పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, కొత్త పోస్టుల్లో రాజకీయ అనుచరులకు అవకాశాలు కల్పించడం అనుమానాలకు దారితీస్తుందని ఆయన విమర్శించారు. పాతవారికి అర్హత బట్టి ప్రమోషన్లు, బదిలీలు కల్పిస్తామని గతంలో పాలకవర్గం హామీ ఇచ్చి వదిలిపెట్టిందని గుర్తుచేశారు. కొత్త నియామకాలకు ముందు పాతవారికి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో పనిచేస్తున్న మాస్టర్ హెడ్ కుక్‌లకు జీవో ప్రకారం జీతాలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో పీఆర్సీ విడుదల చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యలను యూనివర్సిటీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయడానికి సీఐటీయూ కృషి చేస్తుందని, కార్మిక వర్గం అందరూ ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ గౌరవ సలహాదారు ఎం. శ్రీనివాస్, అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, నాయకులు దాసు, రాజేశ్వరి, ప్రసాద్, బాబు, శ్రీదేవీ, రజిత, లతా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ ఎన్నికల్లో ఓడిన ప్రజాస్వామ్యం

**హుస్నాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఓడిపోయి, ధనస్వామ్యం గెలిచిందని బీసీ హక్కుల సాధన సమితి సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగ్గోజు సుదర్శనాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఎన్నికలకు మించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో డబ్బు ప్రవాహం పెరిగిందని ఆయన వాపోయారు. అభ్యర్థులు 10 లక్షల నుండి కోటి రూపాయల వరకు ఖర్చు చేశారని, ఒక్కో ఓటుకు వెయ్యి నుండి పదివేల రూపాయల వరకు పంపిణీ చేసినట్లు ఆరోపించారు. అలాగే మద్యం, మటన్, కానుకలు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభపెట్టారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం అధికారుల నిర్లక్ష్యం వల్ల అభ్యర్థులు విచ్చలవిడిగా వ్యవహరించారని ఆయన విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు మేధావులు, ప్రజాస్వామ్య వాదులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యం చేయాలని ఎగ్గోజు సుదర్శనాచారి పిలుపునిచ్చారు.

# అభివృద్ధి కోసం పోరాటం కొనసాగిస్తా



**హుస్నాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లోయపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మేఘవత్ రమేష్ నాయక్ ఎన్నికల అనంతరం గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నామినేషన్ వేసిన రోజు నుండి పోలింగ్ వరకు తనతో కలిసి నడిచిన కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, మిత్రులు, గ్రామ ప్రజలు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తాను ఓడినా గెలిచినా ప్రజల పక్షానే ఉంటానని, గ్రామ అభివృద్ధి కోసం ఎన్ని పోరాటాలైనా చేస్తానని ఆయన పేర్కొన్నారు. "ఈరోజు ఓటమి రేపటి గెలుపుకు దారి తీస్తుంది. గెలిస్తే న్యాయం చేస్తా, గెలవకపోతే సాయం చేస్తా" అని రమేష్ నాయక్ అన్నారు. మంచాల మండలంలో బీజేపీకి లభిస్తున్న ప్రజాభిమానాన్ని ఆయన ప్రస్తావిస్తూ, తాళ్లపల్లి గూడ సర్పంచ్ జోగు శంకరయ్య, ఆగపల్లి సర్పంచ్ లకుమల్ల ఉమా, ఉపసర్పంచ్ యాట రమేష్ ముదిరాజ్, ఆరుట్ల ఉపసర్పంచ్ నూకం విజయ్ కుమార్, లోయపల్లి ఉపసర్పంచ్ బొడ్డుపల్లి నాగరాజు, చిత్తపూర్ ఉపసర్పంచ్ ఎం. గోవర్ధనా చారి, కాగజ్ గట్టు ఉపసర్పంచ్ మైలారం శ్రీను, నోముల ఉపసర్పంచ్ దండేటికారి దుర్గేష్ సమిష్టి కృషి వల్లే మండలంలో పార్టీ విజయకేతనం ఎగురుతోందని అన్నారు. రానున్న రోజుల్లో మంచాల మండలాన్ని బీజేపీ కంచుకోటగా మార్చే దిశగా ప్రతి గ్రామంలో ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని ఆయన సంకల్పం వ్యక్తం చేశారు.

## ఘనంగా యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు




**నల్లగొండ ,డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శనివారం రోజున యునైటెడ్ పాస్టర్ నల్గొండ కాన్సెన్సీ ఆధ్వర్యంలో యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ మల్లె పెళ్లి వారి గూడెం బేతనీయ క్రిస్టియన్ మినిస్ట్రీస్ క్యాంపస్ నందు ఘనంగా నిర్వహించబడింది ఇందులో దేవుని వాక్యాన్ని పాస్టర్ రాజీవ్ డానియల్ , రామగుండం, చక్కటి క్రిస్మస్ సందేశాన్ని అందించారు పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ సందర్భంగా బేతనీయ మినిస్ట్రీస్ డైరెక్టర్ దాసరి ప్రీతి ప్రశాంత్ కుమార్ సేవకుల కుటుంబాలకు గిఫ్ట్ లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే జాన్ బాబు , పుల్లా రాజ్ కుమార్ ,పేర్ల శాంసన్, సిహెచ్ జాన్ ,సామ్యూల్, జేమ్స్ ,యేసు రత్నం, ఏసుదాస్, ఫిలిప్ రాజ్ ,తిమోతి గిద్యోను , శ్రీకాంత్ ఇంకా ఆయా ప్రాంతాల నుండి దాదాపు 250 మంది పాల్గొని విజయవంతం చేశారు.

## విద్యార్థులకు పంచ పరివర్తన్ పై అవహగాన సదస్సునెర్డ్‌మెట్,





**డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రామకృష్ణ విద్యాలయంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంచ పరివర్తన్ పై అవహగాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్. రావు నగర్ నగర ఆర్ఎస్ఎస్ వికాస ప్రముఖ్ గోపాలాచారి రాఘవన్ పాల్గొని విద్యార్థులకు సమాజంలో తీసుకురావాల్సిన ఐదు ముఖ్యమైన మార్పులపై వివరించారు. కుటుంబ ప్రబోధం, పర్యావరణ సంరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ ప్రోత్సాహం, నాగరికత విలువల పరిరక్షణ వంటి అంశాలను ఆయన విశదీకరించారు. ఈ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని విద్యార్థులను కోరారు. ఈ అవహగాన సదస్సులో 120 మంది విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీసీలకు42% రిజర్వేషన్లు చట్టబద్ధత కల్పించినాకే ఎన్నికలు జరపాలి

**-సామాజికవేత్త, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్.**



**దేవరకొండ డిసెంబర్ 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండ పట్టణంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి మున్సిపల్ ,కార్పొరేషన్ ఎన్నికలలో 42% రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఎన్నికల జరపాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ కి కట్టుబడి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. మొన్న జరిగినటువంటి సర్పంచి ఎలక్షన్లో చట్టబద్ధత కల్పించనప్పటికీ బీసీలు ఐక్యమై జనరల్ స్థానాలలో బీసీలు అత్యధిక స్థానాలు గెలిచి బీసీల యొక్క ఐక్యతను చాటారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల యొక్క న్యాయమైనటువంటి డిమాండ్ ను ఆలోచన చేసి పార్టీ పరంగా కాకుండా చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించాకే ఎంపిటిసి, జెడ్పిటిసి మున్సిపల్ కార్పొరేషన్ కోఆపరేటివ్ బ్యాంక్ తదితర ఎన్నికలు జరిపి బీసీలకు రిజర్వేషన్ల పరంగా న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం చేసి సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చోల్లేటి భాస్కరాచారి, పున్న వెంకటేశంనేత, పెరికేటి శ్రీనివాసాచారి, మాకం చంద్రమౌళి, బొమ్ము వెంకటయ్య, పున్న బిక్షమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చెయ్యొద్దు- సీపీఎం



**నల్లగొండ ,డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, పేరు మార్పు చేయాలనే కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల నాయకులు పోలే సత్యనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్గొండ మండలం అప్పాజిపేట గ్రామంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉపాధి కార్మికులతో కలసి కేంద్ర ప్రభుత్వంపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో గ్రామీణ పేదలకు, ఉపాధి కార్మికులకు జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచే కుట్రగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును ఉపాధి హామీ చట్టం నుండి తొలగించడం దేశ ప్రజల భావోద్వేగాలను అవమానించడమేనని అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా సుమారు 27 లక్షల ఉపాధి కార్డులను తొలగించడం ద్వారా కార్మికుల హక్కులను హరించారని ఆరోపించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం 60 శాతం మాత్రమే నిధులు ఇస్తామని, మిగిలిన 40 శాతం రాష్ట్రాలే భరించాలని చెప్పడం రాష్ట్రాలపై భారాన్ని మోపే దుర్మార్గపు విధానమని అన్నారు. ఈ విధానం కొనసాగితే ఉపాధి పనులు పూర్తిగా నిర్వీర్యమై, కార్మికులు తీవ్రమైన ప్రమాదంలో పడతారని హెచ్చరించారు. గ్రామాల నుంచి వలసలు ఆపేందుకు, గ్రామంలోనే పని కల్పించేందుకు తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులపై పోరాటం చేసిన మహాత్మా గాంధీ పేరును ఉపాధి హామీ చట్టం నుంచి తొలగించడం ఏమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు. గాంధీ హత్యకు పాల్పడిన వారిని దేశభక్తులుగా చెప్పే ఆర్ఎస్ఎస్‌బీజేపీ, గాంధీ పేరు మీద ఉన్న ఉపాధి హక్కును తొలగించడం దుర్మార్గమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా ఉపాధి కార్మికులందరూ ఏకమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోపోలే నరసింహ, లింగస్వామి, శ్రీలత, మణెమ్మ, పోలే సైదమ్మ,కాసర్ల రవి, పోలే సైదులు శంకరయ్య, సింగపంగా ఎల్లమ్మ ధర్మవరపు నాగలక్ష్మి, పోలే సునీత, కాసర్ల అంజమ్మ, పోలే అంజమ్మ, పోలే గణేష్ కాసర్ల వెంకన్న, పోలే యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అయ్యవారిపల్లిలో నోట్ బుక్స్ పంపిణీ





**ఫరూక్ నగర్, డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందే సురేష్ ఆధ్వర్యంలో ఫరూక్నగర్ మండల్ అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాల లో మరియు లాల్ సింగ్ తండా పాఠశాల ఉప్పరిగడ్డ తండా విద్యార్థులకు బుక్స్ పంపిణీ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గందే సురేష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 25 వేల నోటుబుక్స్ షాద్ నగర్ ఆర్యవైశ్య వ్యాపారుల సహకారంతో పంపిణీలో భాగంగా ఈరోజు అయ్యవారిపల్లి గ్రామంలో నోట్ బుక్స్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాల్లో ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా బుక్స్ కమిటీ చైర్మన్ మరియు ఫరూక్నగర్ మండల అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ మాట్లాడుతూ తన పుట్టిన గ్రామంలో బుక్స్ పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫరక్ నగర్ మండల మాజీ అధ్యక్షులు అనుమరి మురళి, మండల కార్యదర్శి బండారు శంకర్, మండల కోశాధికారి గజవాడ యశ్వంత్, జిల్లా మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మల్పెద్ది శ్రీనివాస్, జిల్లా యువజన సంఘం కోశాధికారి మరియు సామాజిక కార్యకర్త నీల రవీందర్, పాఠశాల హెడ్ మాస్టర్ సహన, చంద్రశేఖర్ టీచర్, నర్సింగ్ తండా పాఠశాల ఉపాధ్యాయులు సురేష్, సంపత్ కుమారి, ఉప్పరిగడ్డ తండా టీచర్ అనూష, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన మాజీ వార్డ్ మెంబర్ అమృత్తోజ్ నాగరాజు కంకణాల చంద్రం



**దుబ్బాక - డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దుబ్బాక మండల పరిధిలోని పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన మాజీ వార్డ్ మెంబర్ అమృతోజ్ నాగరాజు కంకణాల చంద్రం, నూతనంగా గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన కొమిరే నరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొంగరం బాల్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులో దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల్లోకి చేరేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వారిని స్వాగతించి, పార్టీలో వారి సేవలకు ధన్యవాదాలు తెలిపారు.

# అర్హులైన వారు ఉచిత న్యాయ సహాయాన్ని ఉపయోగించుకోవాలి

## సీనియర్ సివిల్ జడ్జి శాలినీ




**మహబూబాబాద్, డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ ప్రతినిధులతో ఉచిత న్యాయ సహాయం పై అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉచిత న్యాయ సహాయ గోడపత్రికను అధికారికంగా విడుదల చేశారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శాలినీ షాకెల్లి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక లేదా ఇతర కారణాల వల్ల చట్టపరంగా తమ హక్కులను సాధించుకోలేకపోతున్న వారికి ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు (18 సంవత్సరాల లోపు వారు), ఎస్సీ, ఎస్టీ వర్గాలు, కార్మికులు, కస్టడీలో ఉన్నవారు, అలాగే వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉన్నవారు ఈ సేవలకు అర్హులని వివరించారు.ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించేందుకు జిల్లా కేంద్రంలోని ఆటోలన్నిటిపై గోడపత్రికలను అంటించి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించాలని సూచించారు. బాల్య వివాహాలను నిరోధిద్దామని, చట్టపరమైన అవగాహనతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిద్దామని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణ తేజ్, పట్టణ 1వ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి, ట్రాఫిక్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం పేరు మార్పును నిరసించిన సీపీఐ




**మహబూబాబాద్, డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని “వికసిత్ భారత్ జీ రామ్ జీ”గా పేరు మార్చడాన్ని నిరసిస్తూ సీపీఐ, భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. పార్టీ శ్రేణులు గాంధీ ఫొటో మాస్కులు ధరించి, ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ సారధి మాట్లాడుతూ గాంధీ పేరును ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం అక్షేపనీయమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుపీఏ ప్రభుత్వం సీపీఐ మద్దతుతో వ్యవసాయ కూలీల ప్రయోజనాల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, కొత్త నిబంధనలతో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.మోడీ ప్రభుత్వం రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన స్వయం ప్రతిపత్తిని కాలరాస్తోందని ఆయన వాపోయారు. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు మార్పును కేంద్రం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పిహెచ్డి పట్టా పొందిన నరేందం



**కల్వకుర్తి, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్ గ్రామానికి చెందిన వసంత నరేందర్, ఇంగ్లీష్ ప్రొఫెసర్ శ్రీనివాస సమక్షంలో పీహెచ్డీ పూర్తి చేసి ప్రఖ్యాత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు.ప్రస్తుతం నరేందర్ హైదరాబాద్‌లో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు పిహెచ్డి పట్టా రావడం పట్ల స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఉప్పునుంతల నూతన సర్పంచ్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**ఉప్పునుంతల, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉప్పునుంతల మండల నూతన సర్పంచ్‌గా ఎన్నికైన చింతగాల శీను గారిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఉప్పునుంతల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు పటేల్ ఆధ్వర్యంలో సర్పంచ్ విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో అచ్చంపేట తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజగోపాల్, మండల అధ్యక్షుడు అచ్చంపేట పొలమూరు రాజు, అచ్చంపేట టౌన్ అధ్యక్షుడు తూర్పాటి ముత్యాలు, బల్మూరు మండల అధ్యక్షుడు వెంకటయ్య, కాంపల్లి నిరంజన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చెక్‌డ్యాంలు కూలిపోవడంపై చర్యలు తీసుకోవాలి



**పెద్దపల్లి, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
:పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల సరిహద్దుల గుండా ప్రవహిస్తున్న మానేరు నదిపై గత ప్రభుత్వ హయాంలో డీఎంఎఫ్టీ మరియు ఇతర ప్రభుత్వ నిధులతో నిర్మించిన చెక్‌డ్యాంలు అనతి కాలంలోనే కూలిపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.ఈ ఘటనపై అధికారులు, కాంట్రాక్టర్లు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయడం, కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేయడం, ఇరిగేషన్ అధికారులు అపోహలు సృష్టించే విధంగా ప్రకటనలు ఇవ్వడం వల్ల రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన చెక్‌డ్యాంలు ఇంత త్వరగా కూలిపోవడం విచారకరమని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై, కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పెద్దాపూర్ నూతన సర్పంచ్‌ను ఘనంగా సన్మానించిన మాల మహానాడు



**వెల్దండ, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ నూతన సర్పంచ్ కేశమల్ల అనూష, కృష్ణలను మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం వెల్దండ మాల మహానాడు నాయకుడు జంగిలి ఆనంద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, వార్డు సభ్యుడు అనిల్ కుమార్, గోరటి అశోక్, జంగిలి ప్రవీణ్, పెరుమళ్ళ వెంకటేష్, జంగిలి శ్రీనివాస్, పెరుమళ్ళ అరుణాచలం, కేశమల్ల రమేష్, మండారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు నూతన సర్పంచుల ప్రమాణ స్వీకారం

**ఎలిగేడు, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఎలిగేడు మండలంలోని గెలుపొందిన 12 మంది సర్పంచులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారని మండల అభివృద్ధి అధికారి భాస్కరరావు తెలిపారు.వారితో పాటు ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కూడా పాల్గొననున్నారు. ప్రమాణ స్వీకారం కోసం గ్రామస్తులు ఆసక్తిగా ఎదురుచూస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఉత్సవానికి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం తొలి గ్రామపంచాయతీ సమావేశం జరగనుందని ఎంపీడీవో వెల్లడించారు.

# జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ప్రతిభ పరీక్ష



**మహబూబాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం భాగంగా కురవి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి వహీద్, గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు తాడూరి మాధవాచారి పాల్గొని విద్యార్థులలో గణిత ప్రతిభను వెలికితీయడానికి పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.కురవి మండలం నుండి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు ప్రథమ బహుమతి : వీరేందర్ (కురవి ఉన్నత పాఠశాల), ద్వితీయ : వేదాక్షరి, తృతీయ : అక్షయ (మొద్దులగూడెం ఉన్నత పాఠశాల). విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల గణిత ఫోరం ప్రధాన కార్యదర్శి గుండోజు నరసింహ చారి, కోశాధికారి షేక్ సలీం, మల్లికార్జున్, భీకు చౌహాన్, రవి, బుక్కా వీరభద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాదీ వస్త్రాలపై 40% ప్రత్యేక తగ్గింపు



**కరీంనగర్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి, గణతంత్ర దినోత్సవం సందర్భంగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో ఖాదీ వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు ప్రకటించారు. డిసెంబర్ 22, 2025 నుండి జనవరి 31, 2026 వరకు ఖాదీ వస్త్రాలు 40% తగ్గింపు ధరలకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు.లక్షలాది వడుకు, నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రజలు ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేయాలని ఖాదీ భవన్ కరీంనగర్ మేనేజర్ వెంగళ బిక్షపతి కోరారు.

# బీఆర్ఎస్ బస్తీ బాటలో సమస్యలపై పోరాటం



**ఆమనగల్లు, డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు పట్టణంలో బిఆర్ఎస్ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు పత్యా నాయక్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ 15 వ వార్డులో కార్యకర్తలు,ప్రజలు, మహిళలతో కలిసి బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా ప్రధానంగా వార్డులో నెలకొన్న అండర్ డ్రైనేజీ,వాటర్ లైన్,తాగు నీరు, రోడ్ల గురించి ప్రజలు సమస్యలు తెలియ జేశారని,మున్సిపాలిటీలో బీఆర్ఎస్ రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అన్నారు.కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్,యూత్ వింగ్ అధ్యక్షుడు వడ్డే వెంకటేష్,నాయకులు బాలస్వామి,వస్పుల సాయిలు,రమేష్,సైదులు గౌడ్,శ్రీను,మహేష్ నేత, నాయక్,రాంచందర్,జంతుక కిరణ్,సతీష్,గోపి, జగన్, చాంద్ పాషా,రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపాలకులు కొలువుదీరినట్లే




రాష్ట్రంలో కాస్తా ఆలస్యమైన,ఎట్టకేలకు ఎన్నికల కమీషన్ పంచాయతీ ఎన్నికలను విజయంతంగా నిర్వహించింది.దాదాపు డిసెంబర్ మాసమంతా ఎన్నికలహడావుడితో గ్రామాలలోని నాయకులు నిద్రలేనిరాత్రులు గడుపుతూ ఓటర్లను ఆకర్షించడానికి విశ్వప్రయత్నాలు చేస్తూ,ధనప్రవాహంతో మద్యాన్నీ ఏరులా పారించి,అభ్యర్థులు ఒకరిని మించి మరొకరు పోటీపడుతూ ప్రచార పర్వాన్నీ ముగించుకోని,మూడు విడుతలుగా డిసెంబర్ 11,14,17న ఎన్నికలు నిర్వహించి,రాష్ట్రమంతటా 12778 గ్రామాలకు 11497 గ్రామాలలో ఎన్నికలు జరిపి,వివిధ కారణాలవల్ల 26 గ్రామాలను మినహాయించిన,1205 గ్రామాలు ఏకగ్రీవంతో ఎన్నికైనవారిని కలుపుకొని 12702 గ్రామపంచాయతీలకు ప్రథమపౌరుడి నియామకాలు జరిగిపోయాయి,ఈనెల 22న అధికారికంగా ప్రమాణస్వీకారాలు చేసి గ్రామపాలకులుగా కొలువుదీరనున్నారు.పోటీలో ఎంతమంది అభ్యర్థులున్నప్పటికి చివరికి గెలుపొందేది మాత్రం ఒక్కరే.కావున కొలువుతీరాక కక్ష్యగట్టే ధోరణితో,స్వార్ధపూరిత ఆలోచనలతో ఖర్చుపెట్టిన డబ్బును ఎలా రాబట్టుకోవాలోనని,తమకు మద్దతివ్వని వారిపై ఏ విదంగా కక్ష్యపూరిత చర్యలు చేపట్టాలనో గాకుండా అవినీతికి పాల్పడకుండా దాదాపు ఐదు సంవత్సరాలపాటు గ్రామాభివృద్ధికై గ్రామంలోని పలువురితో చర్చించి నిర్ణయాలు తీసుకుంటూ,ప్రతి కార్యక్రమంలో గ్రామప్రజలను బాగస్వామ్యులుగా చేస్తూ ఎలాంటి కుల,మత,వర్గ భేదాలు లేకుండా అందరినీ సమానంగా చూస్తూ,గ్రామంలోని ప్రతి ఒక్క విభాగానికి ఒక కమిటీలను నియమిస్తూ,ప్రతి సమస్యకు స్పందిస్తూ,ఎప్పటికప్పుడు పరిష్కారమార్గం వైపు అడుగులు వేస్తే,గ్రామప్రజలే అతనిని శాశ్వితంగా ఉండేవిదంగా కోరుకుంటారు . కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పథకంపట్ల అవగాహన ఏర్పర్చుకుంటూ,ఆ పథకాలను తమగ్రామంలోని పేదలు "ఎవ్వరు ఏ పథకానికి అర్హులో" వారికీ ఆ ఫలాలను అందించేందుకు కృషి చేస్తూ,గ్రామాభివృద్ధి దిశగా పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.కానీ చాలా గ్రామాలలో గెలుపొందిన అభ్యర్థులు ప్రభుత్వం నుండి ఎలాంటి ఫలాలు వచ్చిన ముందు వారి పార్టీకార్యకర్తలకు ఎలాంటి షరతులు పెట్టకుండా అధిక ప్రాధాన్యతనిస్తూ ఇప్పించడం జరుగుతుంది.మరీ ముఖ్యంగా గ్రామాలలో ఉచిత పథకాల విషయంలో తమవర్గానికి మద్దతు ప్రకటిస్తూ వర్గపూరిత రాజకీయాలకు తెరలేపుతుంటారు.కానీ ఇదంతా మంచి పరిణామము కాదు . గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే యావత్తు దేశం అభివృద్ధి చెందుతుంది.గ్రామంలోని ప్రతిఒక్కరు వృద్ధిలోకి వస్తనే గ్రామం సైతం అభివృద్ధి చెందుతుంది.గ్రామాభివృద్ధి అనేదీ గ్రామ ప్రధమ పౌరిడిపై ఆధారపడి ఉంటుంది.కావున గ్రామ ప్రజలందరినీ తమ పిల్లలుగా భావించి నిస్వార్థంతో,నిజాయితితో ఎలాంటి పక్షపాత ధోరణి అవలంభించకుండా,అర్హులందరికీ ఆసరాగా వుంటూ అభివృద్ధికై పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**ముందున్న సమస్యలు**

మరికొద్ది రోజులలో వేసవికాలం ప్రారంభం కాబోతున్నది గత సంవత్సరాలనుండి కొన్ని గ్రామాలలో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ,ట్యాంకర్లతో నీటిని అందించడం జరిగింది.సర్పంచ్ లు సైతం ముందు జాగ్రత్తతో ప్రణాళికాయుతంగా వేసవికాలంలో మంచినీటి సమస్య లేకుండా చూసుకోవాలి.


- వితంతువులు,వృద్దులు,అంగ వైకల్యం కలిగిన వారికీ ప్రతి నెల పింఛన్ వచ్చే విదంగా చూసుకుంటూ,ఏమైనా సాంకేతిక సమస్యలతో పేర్లు తొలిగించబడితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించగావాల్సిన అవసరం వున్నది.
- రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా ? ప్రతి నిరుపేదకు ఉపాధిహామీ పథకంలో చోటు ఉన్నదా ? రైతు బీమా,రైతు బందు వస్తుందా ? కల్యాణలక్ష్మి అందరికి అందుబాటులో ఉన్నదా ? వసతి గృహాల కల్పనలో నిరుపేదలకు స్థానమున్నదా ? మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా జరుగుతుందా ? అంగన్వాడీ,పాఠశాలలు సక్రమంగా నడుస్తున్నాయా ? ప్రభుత్వం చేపట్టే పోలియో చుక్కల నిర్వహణ,వాక్సిన్ కు తోడ్పాటు అందిస్తున్నారా ? ప్రతి ఒక్కరి ఇంటికి మరుగుదొడ్లు,ఇంకుడు గుంతలు ఉన్నాయా ? వీటన్నింటినీ చూసుకోవాల్సిన భాద్యత వారిపై వున్నది.
- ప్రతి ఒక్క రైతుకు పంట లోన్లు,పంట నష్టపరిహారం అందుతున్నదో చూసుకోవాలి.
- వంద శాతం అక్షరాస్యత,జనన,మరణ నమోదులు,పచ్చదనం - పరిశుభ్రతకు సహాకరించాలి.
- బడులకు మరమ్మత్తులు,టాయిలెట్లు మరియు ప్రహరీ గోడలు,అంగన్వాడీ కేంద్రాలు,గ్రంథాలయాలు,పంచాయితీ భవనాలు,దేవాలయాలను,కల్యాణ మండపాలు నిర్మించాలి.
- చాలా గ్రామాలలో కోతులు,వీధికుక్కల బెడదలేకుండా శాశ్వత పరిష్కారమార్గాలు చేపట్టాలి.

**ముగింపు**

ప్రతి గ్రామపంచాయతీలో హాజరు రిజిస్టర్ ను ఖచ్చితంగా అమలుచేయాలి.అందులో సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు మెంబర్స్,ఎంపీటీసీలు,కారోబార్,పంచాయతీ కార్యదర్శి,కావలికారు,ఏ ఎన్ ఎమ్ లు,ఆశ వర్కర్,ఉపాధ్యాయులు,చౌకీదార్,విద్యుత్ హెల్పర్,వెటర్నరీ అసిస్టెంట్,గ్రామ పోలీస్ అధికారు,ఫీల్డ్ అసిస్టెంట్,సుంకరులు ఐకెపి బాద్యులు, ఐకెపి యానిమేటర్స్,అంగన్వాడీ టీచర్,వాటర్ మెన్,రేషన్ డీలర్,మధ్యాహ్న భోజనం నిర్వాహకులు తమసంతాకాన్ని నమోదుచేసి తమబాధ్యతలు నిర్వర్తిస్తూ గ్రామాభివృద్ధికి పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.అందరు కష్టించి పనిచేసి,గ్రామాభివృద్ధికి పూనుకుంటారని ఆశిద్దాం.

**వ్యాసకర్త**

**డా.పోలంసైదులు,**
**9441930361.**
**తిరుమలగిరి,వంగూరు మండలం**



# పరిశుభ్రమైన వాతావరణంలో జీవించడం రాజ్యాంగ హక్కు

**-నాగేశ్వర్ రావు**



**మహబూబాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వర్ రావు ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం ప్రతి మనిషి మౌలిక హక్కు అని, ఇది భారత రాజ్యాంగంలోని జీవన హక్కు ప్రకరణ 21లో స్పష్టంగా పేర్కొనబడిందని వివరించారు.జైలు గదుల్లో గాలి, నీరు, శుభ్రమైన టాయిలెట్లు, వైద్య సేవలు కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఖైదీల న్యాయ హక్కులపై సమీక్ష నిర్వహించి, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్న విధానాన్ని వివరించారు.అండర్‌ట్రయల్ ఖైదీల పరిస్థితి, బెయిల్ అవకాశాలపై జైలు అధికారులతో, ఖైదీలతో పరస్పర సంభాషణ జరిపారు. ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థను ఎంతగానో ఉపయోగించుకోవాలని ఖైదీలకు అవగాహన కల్పించారు.


# సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించిన గోలి శ్రీనివాసరెడ్డి



**వెల్దండ, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి శేఖర్, వార్డు సభ్యులు విజయం సాధించిన సందర్భంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి తన నివాసంలో వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ సూరమల్ల సుభాష్, మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కక్షసాధింపు చర్యలకు నిరసనగా ధర్నా

**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



:నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ చార్జ్‌షీట్‌ను ఢిల్లీ కోర్టు నిరాకరించిన నేపథ్యంలో బీజేపీ కక్షసాధింపు చర్యలకు నిరసనగా నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి**

**ధన్గర్‌వాడీ, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉన్నత విద్యలో రాణిస్తూ నైపుణ్యాలను స్వంతం చేసుకున్న యువతకు అపార అవకాశాలు ఉన్నాయని, ఆకాశమే హద్దుగా ఎదగాలంటే ఇష్టపడి చదవాలని ప్రముఖ కాలమిస్ట్, విశ్రాంత ప్రధానాచార్యులు ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు.జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ తమలో దాగిన ప్రతిభను వెలికితీసి, దినదినం మెరుగుపరుచుకుంటూ ఆశించిన లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు, విద్యాలయాలు, ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వినయ సంపన్నతను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రపంచం మెచ్చిన బాల మేధావి శ్రీనివాస రామానుజన్ చూపిన గణిత ప్రతిభకు ప్రపంచ గణిత శాస్త్రవేత్తలు ప్రశంసలు కురిపించారని ఆయన కొనియాడారు. చదువు ఎవరి సొంతం కాదని, పేదరికం చదువుకు అడ్డంకి కాదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డి. తిరుపతి రెడ్డి, కోశాధికారి లయన్ పి. సురేందర్ మాట్లాడుతూ రామానుజన్ జీవితాన్ని ప్రేరణగా తీసుకొని విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించిన సమావేశంలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. అతిథులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించింది.



# బట్టేంకి పోచయ్యకు కన్నీటి వీడ్కోలు.

**పాడేమోసిన సర్పంచ్ జీడిపల్లి నరసింహారెడ్డి...**

**పాల్వంచ డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్ పేట్ గ్రామానికి చెందిన బట్టేంకి పోచయ్య హార్ట్ ఎటాక్ తో మరణించడం ద్వారా శనివారం రోజున ఆశ్రూనయలతో కన్నీటి వీడ్కోలు పలికారు. ఇట్టి అంతిమయాత్రలో గ్రామ నూతన సర్పంచ్ జీడిపల్లి నరసింహారెడ్డి పాడే మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# జాతీయ అవార్డు గ్రహీత పుట్ల నాగేశ్వర్‌రావుకు సన్మానం



**మిర్యాలగూడ, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ అవార్డుకు ఎంపికైన పుట్ల నాగేశ్వర్‌రావును శనివారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఇఓ రామవత్ మాంగ్య నాయక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగేశ్వర్‌రావు జాతీయ అవార్డు అందుకోవడం పత్రికా రంగానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని, ఫొటోగ్రాఫర్‌గా విశేష సేవలు అందించిన ఆయనకు వచ్చిన ఈ గౌరవం సమాజానికి గర్వకారణమని అభినందించారు. కార్యక్రమంలో దశరథ్ నాయక్, మురళీ యాదవ్, రాంబాబు, కోటి, మీడియా జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# ఫర్టి లైజర్ బుకింగ్ యాప్ పైన రైతులకు అవగాహన కార్యక్రమం




**అబ్దుల్లాపూర్ మెట్,డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ వ్యవసాయ శాఖ రైతులు యూరియా కొనుగోలు కేవలం ఫర్టి లైజర్ బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే ముందుగా నమోదు చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తుంది, అదేవిధంగా యూరియా అమ్మే ప్రతి డీలర్ ఈ యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలను చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో ప్లే స్టోర్ నందు ఈ యాప్ వివరాలు అందుబాటులో కలవు కావున అందరూ రైతులు డౌన్లోడ్ చేసుకోవాలని ఇబ్రహీంపట్నం సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత ఈ యాప్ పైన ఈ రోజున అబ్దుల్లాపూర్ మెట్ మండల ఉన్న రైతు వేదిక నందు మండల రైతులకు యూరియా ఫర్టిలైజర్ ఆన్లైన్ బుకింగ్ యాప్ పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాప్ ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకొని యూరియా బుక్ చేసుకోవాలని తెలిపారు ఈ యాప్ పై సందేహాలు ఉంటే మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పల్లవి, వ్యవసాయ విస్తరణాధికారి రఘు, రైతులు ధర్మారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి ,లింగమయ్య మల్లేష్, వెంకటేష్, పాల్గొన్నారు.

# లష్కర్‌గూడ నూతన సర్పంచ్ అల్లే అయిలయ్య యాదవ్‌కు సన్మానం



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్ మెట్ మండల లష్కర్‌గూడ గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి అల్లే అయిలయ్య యాదవ్ తన ప్రత్యర్థి టీఆర్ఎస్ అభ్యర్థి సీక సాయికుమార్ గౌడ్‌పై 240 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. ఈ సందర్భంగా అయిలయ్య యాదవ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనను ఆదరించి సర్పంచ్‌గా ఎన్నిక చేసినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, డ్రైనేజీ సమస్యలు సహా ఏవైనా సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు ముందుండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. తాజా మాజీ జెడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్ నూతన సర్పంచ్ అల్లే అయిలయ్య యాదవ్‌తో పాటు ఉపసర్పంచ్ కరిమెల రాజు, వార్డు సభ్యుడు గుండె శివకుమార్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరో వార్డును అభివృద్ధి చేస్తానని హామీ : గుండె లక్ష్మమ్మ



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్ మెట్ మండల లష్కర్‌గూడ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆరో వార్డు నుండి పోటీ చేసిన గుండె లక్ష్మమ్మ ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ఓటర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వార్డులో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని, వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# గ్రామానికి అధిపతి కాదు గ్రామానికి సేవకుడు!

## కొలువుదీరే కొత్త సర్పంచ్లకు ప్రజల హెచ్చరికలు -సూచనలు




సోమవారం తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గెలుపు ఆనందం, మద్దతుదారుల హర్షధ్వానాల మధ్య వారు కుర్చీలో కూర్చోబోతున్న ఈ సమయంలో గ్రామ ప్రజలు మాత్రం ఒక్క ప్రశ్నతో ఎదురుచూస్తున్నారు ం ఈ సర్పంచ్ మా సమస్యలు వినేవాడా? లేక ఐదేళ్లు అందుబాటులో లేని అధిపతిగా మారతాడా?

సర్పంచ్ పదవి గెలుపుతో ముగిసిపోయే పోటీ కాదు. అది గ్రామ జీవితానికి మొదలయ్యే బాధ్యత. గ్రామానికి నీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, ఉపాధి, భద్రత, గౌరవం... ఇవన్నీ ఒకే తలుపు తట్టే స్థానం సర్పంచ్‌ది. అందుకే ఈ ప్రమాణ స్వీకారం రోజున కొత్త సర్పంచులు గుర్తుంచుకోవాల్సింది ం మీరు అధికారం తీసుకోవడం కాదు.. ప్రజల భారం మోసుకోవడం మొదలు పెట్టుతున్నారు.

**సర్పంచ్ - సగం బలం సంఘం నాయకుడా? లేక సంపూర్ణ బాధ్యత?**

సర్పంచ్ అంటే పార్టీకి ప్రతినిధి కాదు.
సర్పంచ్ అంటే కులానికి నాయకుడు కాదు.
సర్పంచ్ అంటే కాంట్రాక్టర్లకు సంతక యంత్రం కాదు. సర్పంచ్ అంటే గ్రామంలోని చివరి వ్యక్తి సమస్యకూ జవాబు చెప్పాల్సిన తొలి పాలకుడు. గ్రామ పంచాయతీ కార్యాలయం గోడల మధ్యే కాదు... మురికి కాలువ దగ్గర, బురద రోడ్డుపై, నీళ్లు రాని బోరు ముందు కనిపించాల్సిన వ్యక్తి సర్పంచ్.

**ప్రమాణ స్వీకారం తర్వాత వెంటనే చేయాల్సిన పనులు ఇవే**

-కొత్తగా కొలువుదీరిన సర్పంచులు మొదటి వారం రోజుల్లోనే కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాలి.
-గ్రామ పంచాయతీ ఆస్తులు, నిధులు, రికార్డులపై పూర్తిస్థాయి అవగాహన
-గత పాలన నుంచి పెండింగ్‌లో ఉన్న పనుల జాబితా
-తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి తక్షణ సమస్యల ప్రాధాన్యత క్రమం
-పంచాయతీ సిబ్బందితో స్పష్టమైన బాధ్యతల పంపిణీ
-గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు, యువతతో ప్రత్యక్ష సమావేశాలు
-ఫైళ్లలో పాలన కాదు.. ఫీల్డ్‌లో పాలననే ప్రజలు కోరుకుంటున్నారు.
-ఇవి చేయకపోతే ఐదేళ్లు ప్రజల కోపమే మిగులుతుంది
-కొత్త సర్పంచులు ముఖ్యంగా దూరంగా పెట్టాల్సినవి కొన్ని ఉన్నాయి.
-నామీల చేతిలో పాలన నడపడం
-కాంట్రాక్టర్ల మాటే చట్టంగా మారడం
-పార్టీ, కులం, వర్గం పేరుతో వివక్ష
-ప్రజలను చూడకుండా ప్రచార ఆర్భాటంలో మునగడం
ప్రజలు ఓటు వేశారు - బినామీలకు కాదు.
గ్రామం అధికారాన్ని ఇచ్చింది -దోపిడీకి కాదు.

**పారదర్శకతే నిజమైన బలం**

గ్రామ సభలు కేవలం పేరుకే కాకుండా ప్రజలతో నిజమైన చర్చ వేదికలుగా మారాలి. ప్రతి రూపాయి ఖర్చు గ్రామానికి తెలిసేలా ఉండాలి. పనుల నాణ్యతపై రాజీ లేకూడదు. ప్రశ్నించే ప్రజలను శత్రువులుగా కాకుండా సూచనలుగా తీసుకోవాల్సిన పరిపక్వత సర్పంచ్‌లో ఉండాలి.

ఈ రోజు ప్రమాణ స్వీకారం... రేపటినుంచే పరీక్ష
ఈ రోజు మీరు చేయబోయేది ప్రమాణ స్వీకారం. రేపటి నుంచి ప్రజలు తీసుకునేది పరీక్ష.
గ్రామంలో మంచినీళ్లు లేకపోతే మీ ప్రమాణం ప్రశ్నార్థకం.
**రోడ్లు బాగోలేకపోతే -మీ పాలనపై తీర్పు.**
పేదవాడికి న్యాయం జరగకపోతే-మీ పదవికే అర్థం లేదు.

గుర్తుంచుకోండి...
గ్రామం మీ కోసం కాదు.
మీరు గ్రామం కోసం.

వ్యాసకర్త
గంగవరం రామకృష్ణారెడ్డి
సామాజిక విశ్లేషకులు

# క్రమశిక్షణ గల్లంతైన కాంగ్రెస్

## వనపర్తిలో వర్గ పోరుల రాజకీయం! గెలుపే లక్ష్యంగా రూల్స్ లేని గేమ్ రాజకీయాలు




**వనపర్తి,డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్య విలువలు, క్రమశిక్షణకు ప్రతీకగా ఉన్న పార్టీ నేడు వర్గ పోరులతో, గేమ్ రాజకీయాల కేంద్రంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గెలుపే పరమావధిగా సిద్ధాంతాలను పక్కనపెట్టి అధికార రాజకీయాల్లో మునిగిపోయిన పరిస్థితి వనపర్తి కాంగ్రెస్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. "ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా ఆపలేడు" అన్న నానుడి ఇక్కడ అక్షరాలా నిజమవుతోంది. పార్టీకి నష్టం చేస్తున్నది ప్రత్యర్థులు కాదు...పార్టీలోనే ఉన్న వర్గాలేనన్న అభిప్రాయం కార్యకర్తల్లో బలపడుతోంది. పార్టీలో చోటుచేసుకున్న వర్గపోరు కారణంగా కార్యకర్తలు తీవ్ర అయోమయంలో పడ్డారు. ఒక వర్గం "కాలం చెల్లిన నాయకుల వల్లే పార్టీ వెనక్కి వెళ్తోంది" అని ఆరోపిస్తుంటే మరో వర్గం"కొత్తగా వచ్చినవాళ్లు సిద్ధాంతాల్లేని నకిలీ కాంగ్రెస్" అంటూ ఎదురు విమర్శలు చేస్తోంది. ఈ అహంకారాల కొట్లాటలో కొంపముంచిన ఫలితాలు ఇప్పటికే పార్టీకి హెచ్చరికగా నిలుస్తున్నాయి. ప్రజల సమస్యలపై పోరాడాల్సిన నాయకులు తమ ఆధిపత్యం కోసం రాజకీయ చదరంగంలో పావుల్లా కదులుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే వనపర్తి పీఠంలో కూర్చున్న ఇద్దరు పెద్దల మధ్యే ఈ బహిరంగ విభేదాలు కొనసాగుతున్నాయి. ఎవరి మాటే పార్టీ లైన్ అన్నట్టుగా పరిస్థితి మారడంతో, కింది స్థాయి కార్యకర్తలు ఎవరి వెంట నడవాలో తెలియక మౌనంగా ఉండిపోతున్నారు. ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ శ్రేణుల నుంచీ ప్రజల నుం ఒకే ప్రశ్న బలంగా వినిపిస్తోంది

**"రేవంత్ సారు...వనపర్తిలో మీరు ఎవరికి రైట్ చెబుతారో?'**

ఈ ప్రశ్నకు త్వరలోనే స్పష్టత ఇవ్వకపోతే వనపర్తి కాంగ్రెస్‌లో వర్గ పోరు మరింత ముదిరే ప్రమాదం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# లైవ్ టీవీ చర్చలో ఘర్షణ,..... కొట్టుకున్న రామ్‌దేవ్ బాబా, ప్యానలిస్ట్



**న్యూఢిల్లీ డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** యోగా గురువు రామ్‌దేవ్ బాబా, ప్యానలిస్ట్ మధ్య టీవీ చర్చా కార్యాక్రమంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో వారిద్దరూ ఘర్షణ పడ్డారు. లైవ్‌లో పంచ్‌లు కురిపించి, నేలపైకి తోసుకుని కొట్టుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అమర్ ఉజాలా టీవీలో లైవ్ డిబేట్ సందర్భంగా రామ్‌దేవ్ బాబా, ఒక ప్యానలిస్ట్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో తన బలాన్ని ప్రదర్శించేందుకు రామ్‌దేవ్ బాబా ప్రయత్నించారు. చర్చలో పాల్గొన్న వ్యక్తితో నేరుగా తలపడ్డారు. ఆయనను కిందకు నెట్టేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా ప్యానలిస్ట్‌పై ఆయన పంచులిచ్చారు. కాగా, చర్చలో పాల్గొన్న వ్యక్తి కూడా ధీటుగా తన బలాన్ని ప్రదర్శించాడు. రామ్‌దేవ్ బాబాపై ఎదురుదాడి చేశాడు. ఆయన పైకి లేవకుండా గట్టిగా ప్రయత్నించాడు. దీంతో రామ్‌దేవ్ బాబా వెనక్కి తగ్గారు. సరదా, హాస్యం కోసమే ఇలా చేసినట్లు చెప్పారు. దీనిని మరో విధంగా పరిగణించవద్దని కోరారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో రామ్‌దేవ్ బాబాపై పలువురు కామెంట్లు చేశారు. నెయ్యి వంటి పతంజలి ఉత్పత్తులను వ్యంగ్యంగా విమర్శించారు. ఆయనను 'స్కామ్‌దేవ్' అని కొందరు ఆరోపించారు. ఇలాంటి టీవీ కార్యక్రమాలు నిర్వహించడంపై మరి కొందరు మండిపడ్డారు.

## రెండో వార్డును అభివృద్ధి చేస్తాను

– సుర్వి రజిత శ్రీకాంత్ గౌడ్



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్ మెట్ మండల లష్కర్‌గూడ గ్రామపంచాయతీ ఎన్నికల్లో రెండో వార్డు నుండి పోటీ చేసిన సుర్వి రజిత శ్రీకాంత్ గౌడ్ 54 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ఓటర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వార్డులో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని, వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## అమ్రాబాద్ మండల నూతన సర్పంచ్‌లకు సన్మానం



**అమ్రాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీల నూతన సర్పంచ్‌లను సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అమ్రాబాద్ గ్రామ సర్పంచ్ చిగుర్ల కోటయ్య, మన్ననూర్ గ్రామ సర్పంచ్ మంజుల, దోమలపెంట ఉపసర్పంచ్ మోయిజ్‌లను శాలువాలతో సన్మానించారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు చింతల రాజగోపాల్, మాజీ ఎంపీపీ అవుట శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు హరి నారాయణ, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహీం, మాజీ ఎంపిటిసి దాసరి శ్రీనివాసులు, కేశవులు, శివాజీ, మాజీ వైస్ ఎంపీపీ పెర్ముల్లా వెంకటేశ్వర్లు, శంభు శోభ, జూలూరి సత్యనారాయణ, కుందా మల్లికార్జున్, సురేష్, నరేష్, అశోక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ వంశీకృష్ణను అభినందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**అమ్రాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గాంధీభవన్‌లో శనివారం అభినందించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మొత్తం 174 స్థానాల్లో 127 స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం విశేషమని, 73% విజయంతో రాష్ట్రంలోని టాప్ టెన్ నియోజకవర్గాల్లో అచ్చంపేట నిలవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం స్థానిక సంస్థల్లో గెలుపొందిన అభ్యర్థులకు దిశానిర్దేశం చేస్తూ, రానున్న ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, మిరాజ్, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు. పార్టీ పరంగా అన్ని విధాలుగా సహకారం అందిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు హామీ ఇచ్చారు.

## కుత్బుల్లాపూర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ పరిధిలోని కృషి కాలనీలో రూ. 10 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు, అంజిరెడ్డి బస్తీలో రూ. 20 లక్షలతో మంజీరా నీటి పైప్‌లైన్ పనులు గౌరవ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా మంజూరయ్యాయి. ఈ పనులను ఈరోజు కృషి కాలనీ వాసుల ఆధ్వర్యంలో, అంజిరెడ్డి బస్తి సొసైటీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రజల అవసరాలను తీర్చే అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయి. ప్రతి కాలనీ, ప్రతి బస్తీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, పార్టీ నాయకులు బాల్లెం షామెల్, తన్నీరు శ్రీనివాస్, కండక్టర్ హరి, పి. గోపాల, మజీద్ పాషా, వెంకట్ రెడ్డి, సత్తిరెడ్డి చంద్రకాంత్, శాంతయ్య పంతులు, ప్రభాకర్, సిద్దు, లక్ష్మణ్, రాజు, నరసింహారెడ్డి, కృష్ణంరాజు, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, హరికిరణ్, నాగిరెడ్డి, తులసి, గురువారెడ్డి, రాజు చారి, నాగేష్ రెడ్డి, ఆనంద్, తిరుపతి రెడ్డి, నరసింహ గౌడ్, రామ్ చందర్, చందు, కరణ్, శైలజ, అర్చన, బాలాజీ, రాహుల్, కొమురయ్య, సలోని, మల్లారెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్లలో ఈహెచ్‌ఎస్ ఉచిత శిక్షణా కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ సమావేశ మందిరంలో కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్‌ఎస్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో 29వ ఉచిత శిక్షణా కార్యక్రమం విజయవంతంగా జరిగింది. పరిశ్రమల్లో భద్రతా విధానాల బలోపేతం, పర్యావరణ పరిరక్షణ, ప్రయోగశాల ప్రమాణాలు, పారిశ్రామిక వాయు పరీక్షలు, అగ్ని భద్రత, అలాగే వృత్తి ఆరోగ్య– భద్రతా నిర్వహణ వ్యవస్థలపై నిపుణులు విస్తృతంగా అవగాహన కల్పించారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను ముందస్తుగా అమలు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు అశోక్ పొడిశెట్టి మాట్లాడుతూ "భద్రతను కేవలం నిబంధనల పరిమితిలో కాకుండా సంస్థ సంస్కృతిలో భాగంగా తీసుకెళ్లాలి. ఉద్యోగుల భద్రత, సంస్థ ఆస్తుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణకు మేనేజ్‌మెంట్ నాయకత్వం, ఉద్యోగుల చురుకైన భాగస్వామ్యం అత్యంత కీలకం" అని అన్నారు. కౌన్సిల్ జనరల్ కార్యదర్శి ఎ. సూర్యప్రకాశ్, సభ్యులు హరి బుక్య, జగదీశ్వరరావు, తిరుపతి పాల్గొని పరిశ్రమలు ఎదుర్కొంటున్న ఈహెచ్‌ఎస్ సమస్యలపై చర్చించారు. రీసస్టైనబిలిటీ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.కె.వి. నటరాజ్, బేసిక్ ఎలిమెంట్స్ డైరెక్టర్ ప్రసాద్ నిస్టాలా తమ అనుభవాలను పంచుకున్నారు. 80కి పైగా కంపెనీల ఈహెచ్‌ఎస్ నిపుణులు, ప్రయోగశాల సిబ్బంది, సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రజలు, పర్యావరణం, సంస్థల ఆస్తుల రక్షణలో సమూహ బాధ్యత అత్యంత కీలకమని బలమైన సందేశంతో కార్యక్రమం ముగిసింది. కౌన్సిల్ అధ్యక్షుడు తపస్ సహా మాట్లాడుతూ "గత 10 సంవత్సరాలుగా సీఈపీ విజయవంతంగా కొనసాగడానికి సహకరించిన పరిశ్రమలు, నిపుణులకు కృతజ్ఞతలు. భవిష్యత్తులో కూడా ఇదే సహకారం కొనసాగాలని, లక్ష్యాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నాం" అని తెలిపారు.

## మాడుగులలో సుంకిరెడ్డి మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

**మాడుగుల, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాడుగుల మండల ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల కోసం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడుతోంది. ఈ శిబిరం డిసెంబర్ 21 (ఆదివారం) నుండి డిసెంబర్ 29 (సోమవారం) వరకు మాడుగుల పట్టణ కేంద్రంలోని శ్రీ వాసవి ఫంక్షన్ హాల్ (ఆమనగల్ రోడ్)లో జరుగుతుంది. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సేవలు అందించబడతాయి. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు %డ% టాస్క్–సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో, ఐక్యత ఫౌండేషన్ మరియు శంకర నేత్రాలయ చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలతో పాటు కంటి శుక్లాల (క్యాటరాక్ట్) ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయబడతాయి. ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరి. మండల ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వారు ఈ తొమ్మిది రోజుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమ విజయవంతం కోసం స్థానిక నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, మీడియా మిత్రులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## మనోహరాబాద్ మండల సర్పంచుల ఫోరమ్ కమిటీ ఏర్పాటు



**మనోహరాబాద్, డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్**
: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలానికి చెందిన పలు గ్రామాల సర్పంచులు శనివారం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని కలిశారు. ఆయన వారిని శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించారు. అనంతరం మండల సర్పంచుల ఫోరమ్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. లింగారెడ్డిపేట గ్రామ సర్పంచ్ శివగోని పెంటా గౌడ్ అధ్యక్షుడిగా, మనోహరాబాద్ గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన 11 గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెదక్ ఎంపీని కలిసిన నూతన సర్పంచులు



**మెదక్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల నూతన సర్పంచులు శనివారం మెదక్ ఎంపీ రఘునందన్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు జీడిపల్లి సర్పంచ్ నర్సుగారి కృష్ణ, ముప్పిరెడ్డిపల్లి సర్పంచ్ రాజనర్సింహాలకు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, జిల్లా నాయకులు నత్తి మల్లేష్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, నాయకులు నరేందర్ చారి, రాజుతో పాటు మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 22న కోతులారం గ్రామ సర్పంచ్‌గా జాల జంగయ్య ప్రమాణ స్వీకారం

**ఎల్‌బీ నగర్, డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కోతులారం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన జాల జంగయ్య ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 22న ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



గ్రామ ప్రజల ఆశీస్సులతో సర్పంచ్‌గా ఎన్నికైన జాల జంగయ్య మాట్లాడుతూ, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వట్టి కోటి శేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకంగా పాలన సాగిస్తామని ఆయన చెప్పారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆశీస్సులు అందించాలని ఆయన కోరారు. గ్రామ పాలనలో నూతన అధ్యాయానికి నాంది పలికే ఈ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోతులారం గ్రామ శాఖ అధ్యక్షులు ఏపూరి యాదయ్య, సీనియర్ నాయకులు గుండు చెన్న కృష్ణయ్య, పందుల అంజయ్యతో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొననున్నారు.

# రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్లు తప్పనిసరి చేయాలి

**హైదరాబాద్, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో దళితుల జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని మహా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యపాగ నర్సింగ్ రావు మాదిగ డిమాండ్ చేశారు. తాజా డెలిమిటేషన్ ప్రకారం గ్రేటర్ హైదరాబాద్‌లో 300 వార్డులు ఏర్పాటయ్యాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి 24 వార్డులు కేటాయించినప్పటికీ, ఎస్సీ రిజర్వేషన్లు సరైన విధంగా అమలు కాలేదని ఆయన ఆరోపించారు. దళితుల జనాభా 20 శాతం ఉన్నప్పటికీ తగిన ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. జనాభా దామాషా ప్రకారం కనీసం 8 వార్డులను ఎస్సీకి రిజర్వ్ చేయాలని, అదనంగా జనరల్ వార్డులలో ఒకటిని ఎస్సీ అభ్యర్థికి కేటాయించాలని మహా ఎంఆర్‌పీఎస్ డిమాండ్ చేసింది. ఈ అంశంపై 50 దళిత



సంఘాలు తీర్మానం చేశాయని తెలిపారు. భూదాల విజయభాస్కర్ మాదిగ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు దళిత ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కుత్బుల్లాపూర్ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు కిషన్ రావు మాట్లాడుతూ రిజర్వేషన్ సాధన కోసం అధికారుల వద్ద కమిటీతో కలిసి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రిజర్వేషన్ సాధన సమితి (జాక్) ఏర్పాటు చేసినట్లు ముత్యపాగ నర్సింగ్ రావు వెల్లడించారు. ఎస్సీ హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూదాల భాస్కర రావు, బుచ్చయ్య, సిద్దయ్య, పెరుమాండ్ల గోపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, ఎన్ఎస్‌యు ఐ నాయకులు పృథ్వీ, మహిళా నాయకురాలు జజల రమ్యా, సుమారు 50 మంది దళిత నాయకులు పాల్గొన్నారు.

# చివరి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకం అందాలన్నదే ఏకైక లక్ష్యం






**-టీం వర్క్ తోనే పనిచేశాను ....**
**చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎన్.క్షితిజ..**
**-ప్రభుత్వ పథకాలను క్షితిజ మేడం చిత్తశుద్ధితో అమలు చేశారు...**
**అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ ...**

**హైదరాబాద్, నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మరియు ఎస్సీ కార్పొరేషన్ ప్రభుత్వ పథకాలను కమిషనర్ గా శ్రీమతి ఎన్.క్షితిజ విజయవంతంగా అమలు చేశారని అడిషనల్ డైరెక్టర్ సి. శ్రీధర్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో క్షితిజ మేడం చేసిన సేవలు మరువలేనివి లేనివి అని అన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ గా కార్పొరేషన్ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ పనిచేసి తనదైన శైలిలో చెరగని ముద్ర వేశారని అడిషనల్ డైరెక్టర్ అన్నారు. ఎస్సీడిడి కమిషనర్ గా మరియు ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా పనిచేసి ఇటీవలనే తన మాతృ శాఖకు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అయినటువంటి అటవీ శాఖకు వెళ్లిన



సందర్భంగా మాసాబ్ ట్యాంక్ లోని డి ఎస్ ఎస్ భవన్ లో క్షితిజ కు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ వికాస్ పథకం అమలు కోసం క్షితిజ మేడం చిత్తశుద్ధితో కృషి చేశారని అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ గా పనిచేసి తన మాతృ శాఖ అయినటువంటి అటవీ శాఖకు బదిలీ అయిన క్షితిజ మేడం మాట్లాడుతూ కార్పొరేషన్ మరియు ఎస్సీ డిపార్ట్మెంట్ సిబ్బంది టీం వర్క్ తో పనిచేయడం వల్లనే ప్రభుత్వ పథకాలను అమలు చేశామని అన్నారు. ఎస్సీడిడి శాఖకు తాను కొత్త అయినప్పటికీ కార్యాలయ సిబ్బంది మరియు ఫీల్డ్ సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని క్షితిజ అన్నారు. చివరి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందాలన్న ఏకైక లక్ష్యంతోనే తాను పనిచేశానని ఆమె స్పష్టం చేశారు. ఇది ఇలా ఉండగా రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసినటువంటి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మరియు ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారులు, కమిషనర్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని క్షితిజ సేవలు సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిసి డిపార్ట్మెంట్ కమిషనర్ మాయ బాలాదేవి, ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ హనుమంత్ నాయక్, బీసీ డిపార్ట్మెంట్ అడిషనల్ డైరెక్టర్ ఇతర అధికారులు, జిల్లా అధికారులు, డీడీలు, డీఎస్సీడివో లు ఎస్సి డిడి అధికారులు, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం క్షితిజ కు శాలువాలు కప్పి, బొకేలు ఇచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు.


# ఉపాధి హామీని కాపాడుకుందాం

**-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**




**ఆమనగల్లు, డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా అణగారిన వర్గాల హక్కుల కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ శ్రేణులు,ఎమ్మెల్యే సర్పంచులు,కార్మికులు, కర్షకులు,మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారుఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 20 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టానికి మోదీ ప్రభుత్వం 'ఉరి' వేస్తోందని, లోక్‌సభలో చర్చ లేకుండా హడావుడిగా బిల్లులు పాస్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఉపాధి కూలీల్లో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు మరియు మహిళలే ఉన్నారని, కేంద్ర వైఖరి వల్ల వారి ఆర్థిక స్వేచ్ఛ, ఆత్మగౌరవం దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.


## అగ్నివీరులకు శుభవార్త.. బీఎస్ఎఫ్ నియామకాల్లో రిజర్వేషన్ కోటా పెంపు



**న్యూఢిల్లీ డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అగ్నివీరులకు కేంద్రం శుభవార్త చెప్పింది. సరిహద్దు భద్రతా దళం నియామకాల్లో అగ్నివీరుల కు సంబంధించిన నిబంధనలను సవరిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో ఇప్పటివరకు 10 శాతంగా అగ్నివీరుల రిజర్వేషన్ కోటాను 50 శాతానికి పెంచినట్లు పేర్కొంది.మొదటి దశలో మాజీ అగ్నివీరులకు కేటాయించిన 50 శాతం ఖాళీలకు, రెండో దశలో మాజీ అగ్నివీరులు కాకుండా మిగిలిన (పది శాతం మాజీ సైనికులతో సహా) ఖాళీలకు నియామకాలు నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. మొదటి దశలోని ఒక నిర్దిష్ట విభాగంలో మాజీ అగ్నివీరులతో కాకుండా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపింది. త్రివిధ దళాల్లో నియామకాలకు సంబంధించి 2022 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అగ్నివీరులుగా వారి నాలుగేళ్ల సర్వీస్ ముగిసిన అనంతరం రిజర్వేషన్ ద్వారా కేంద్ర పారామిలిటరీ బలగాల్లో వారిని నియమించుకుంటున్నారు. ఇందులో భాగంగానే గతంలో అన్ని కేంద్ర సాయుధ పోలీసు దళాలలోని కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఖాళీలలో 10 శాతం కోటా మాజీ అగ్నివీరులకు కేటాయించారు. అయితే తాజా నోటిఫికేషన్‌లో.. అగ్నివీరులకు 50 శాతం రిజర్వేషన్ కోటాను ఇతర కేంద్ర పారామిలిటరీ దళాల్లో కాకుండా కేవలం బీఎస్ఎఫ్ నియామకాల్లో మాత్రమే అమలు చేస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం మాజీ అగ్నివీరులకు శారీరక సామర్థ్య పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వగా.. రాత పరీక్షలో వారు ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

# యూరియా ఇక సులువే.... యాప్‌లో ఇంటి నుండే బుకింగ్


**ఆమనగల్లు, డిసెంబర్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రైతులు యూరియా కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన అవసరానికి తెరపడుతోంది. వ్యవసాయ శాఖ ప్రవేశపెడుతున్న నూతన ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇకపై ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఈ కొత్త విధానాన్ని ఈ నెల 20 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.గత ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో పలుచోట్ల రైతులు ఆందోళనలు, ధర్నాలకు దిగిన నేపథ్యం తెలిసిందే. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా, యూరియా పక్కదారి పట్టకుండా నిజమైన సాగు రైతులకే చేరేలా ఈ సాంకేతిక విధానాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 19న ఆయా మండలాల్లోని రైతు వేదికల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ యాప్‌లో రైతు తన పట్టాదారు పాసుపుస్తక నంబరు నమోదు చేయగానే నమోదు చేసిన మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ధృవీకరించిన వెంటనే రైతుకు చెందిన భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న




పంట వివరాలు యాప్‌లో కనిపిస్తాయి. ఆ పంటకు ఎంత మేర యూరియా అవసరమో కూడా స్పష్టంగా చూపిస్తుంది. తద్వారా రైతుకు బుకింగ్ ఐడీ జనరేట్ అవుతుంది. ఆ ఐడీతో అధికారిక రిటైలర్లు లేదా సహకార సంఘాల ద్వారా యూరియా కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉంటుంది.సాగు భూమి పరిమాణాన్ని ఆధారంగా తీసుకుని అవసరమైన యూరియా సంచుల సంఖ్య యాప్‌లో స్పష్టంగా చూపించబడుతుంది. రైతులు విడతలవారీగా యూరియా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి బుక్ చేసిన స్లాట్ 48 గంటల పాటు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఆ సమయంలో యూరియా తీసుకోకపోతే, ఆ స్లాట్ తిరిగి ఇతరులకు అందుబాటులోకి వెళ్తుంది. ఈ యాప్ ద్వారా జిల్లా మొత్తం మీద ఎక్కడెక్కడ యూరియా అందుబాటులో ఉందో, ఎంత నిల్వ ఉందో అన్న సమాచారాన్ని అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. దీంతో సరఫరా వ్యవస్థ పారదర్శకంగా మారడంతో పాటు, రైతులకు యూరియా అందుబాటులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండనుందని వ్యవసాయ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నాలుగో స్థంభం పునరుద్ధరణకు దారి ఎక్కడ?



నాలుగో స్థంభానికి పడుతున్న చీలికలపై ఆందోళన వ్యక్తం చేయడమే సరిపోదు. దారి తప్పుతున్న జర్నలిజాన్ని తిరిగి సరైన మార్గంలో నడిపించేందుకు ఏం చేయాలి? అన్న ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన దశకు సమాజం వచ్చింది. విమర్శల తర్వాత సంస్కరణలు లేకపోతే ఆవేదన అర్థం కోల్పోతుంది. మొదటగా, జర్నలిజాన్ని వృత్తిగా కాకుండా "బాధ్యతగా" భావించే సంస్కృతి తిరిగి రావాలి. వార్త అంటే కేవలం సంచలనం కాదుబీ అది సమాజంపై పడే ప్రభావం. ఒక శీర్షిక, ఒక వీడియోఎవరి జీవితాన్నైనా మార్చగల శక్తి కలిగి ఉంటాయి. ఆ శక్తిని వ్యక్తిగత లాభానికి ఉపయోగించడం వృత్తిపై చేసిన ద్రోహమే అన్న స్పష్టత ప్రతి రిపోర్టర్ మనసులో నాటుకుపోవాలి. ఈ మార్పులో కీలక పాత్ర మీడియా యాజమాన్యాలదే. సంపాదకీయ స్వాతంత్ర్యంతో పాటు సంపాదకీయ బాధ్యతను కూడా సమానంగా నిలబెట్టాలి. రిపోర్టర్ ప్రవర్తన, అతని ఫీల్డ్ పనితీరు, ప్రజలతో వ్యవహరించే తీరుఇవన్నీ నిరంతర సమీక్షకు లోబడి ఉండాలి. తప్పు చేసినవారిని రక్షించడం కాదు, వృత్తి విశ్వసనీయతను రక్షించడం మీడియా హౌజీల అసలైన బాధ్యత. అదే సమయంలో, జర్నలిస్టుల శిక్షణ పద్ధతుల్లోనూ మార్పు అవసరం. చట్టం, నైతికత, మానవ హక్కులు, డిజిటల్ మీడియా బాధ్యతుఇవన్నీ కేవలం పాఠ్యాంశాలుగా కాకుండా, ప్రాక్టికల్ అవగాహనగా అందాలి. "ఏం రాయాలి" అన్నదానికంటే "ఏం రాయకూడదు" అన్న స్పష్టత పెరిగినప్పుడే వృత్తికి గౌరవం పెరుగుతుంది. ప్రభుత్వం పాత్ర కూడా ఇక్కడ కీలకం. ప్రెస్ స్వేచ్ఛకు భంగం కలగకుండా, అదే సమయంలో ప్రెస్ పేరుతో జరిగే అక్రమాలను అరికట్టే సమతుల్య విధానం అవసరం. నకిలీ మీడియా కార్డులు, ఫేక్ ఛానళ్లపై కఠిన చర్యలు తీసుకుంటూనే, నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు భద్రత, గౌరవం కల్పించాలి. చట్టం ఒకవైపు కఠినంగా, మరోవైపు న్యాయంగా ఉండాలి. పౌర సమాజం కూడా ప్రేక్షకుడిగా కాకుండా భాగస్వామిగా మారాలి. ప్రతి వీడియోను, ప్రతి పోస్ట్‌ను అంధంగా నమ్మకుండా ప్రశ్నించే దృక్పథం అవసరం. జర్నలిజాన్ని వినియోగించే ప్రజలే దాని ప్రమాణాలను నిర్ణయిస్తారు. నకిలీ సంచలనాలకు ప్రోత్సాహం తగ్గినప్పుడే బాధ్యతాయుతమైన జర్నలిజానికి స్థానం పెరుగుతుంది. చివరికి, జర్నలిజం భవిష్యత్తు ఒక సత్యంపై ఆధారపడి ఉందినాలుగో స్థంభం బలహీనపడితే ప్రజాస్వామ్యమే బలహీనపడుతుంది. అందుకే జర్నలిజం పతనాన్ని ప్రేక్షకుల్లా చూడటం కాదు, పునరుద్ధరణకు భాగస్వాములుగా మారడం సమాజం ముందు ఉన్న సవాల్. సత్యం, నైతికత, బాధ్యతుఈ మూడు మళ్లీ జర్నలిజానికి మూలస్థంభాలైనప్పుడే నాలుగో స్థంభం తన అసలైన ఎత్తుకు చేరుకుంటుంది.

**వ్యాసకర్త**

నిడిగొండ శ్రీరామ్
చీఫ్ ఎడిటర్
నీలగిరి ఎక్స్ ప్రెస్
రాష్ట్ర అధ్యక్షులు -
తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్



## ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్యకు 17 ఏళ్ల జైలుశిక్ష

**ఇస్లామాబాద్‌ డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తో పాటు ఆయన భార్య బుష్రా బీబీకి 17 ఏళ్ల జైలుశిక్ష పడింది. తోషాకానా-2 అవినీతి కేసులో ఈ శిక్ష విధించారు. ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి చెందిన ప్రత్యేక కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. 2021లో సౌదీ ప్రభుత్వం అందజేసిన కానుకలను ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా అక్రమంగా వాడుకున్నట్లు తెలిసింది. ఆ ఘటనపై తోషాకానా కేసు నమోదు చేశారు. స్పెషల్ కోర్టు జడ్జీ షారూక్ అర్జుమంద్ తీర్పును వెలువరించారు. రావల్పిండిలోని హైసెక్యూర్టీ ఉన్న అదియాలా జైలులో తీర్పును ఇచ్చారు.



పాకిస్థాన్ శిక్షా స్మృతిలోని సెక్షన్ 409 కింద ఇమ్రాన్, ఆయన భార్య బుష్రాకు పదేళ్ల శిక్ష వేశారు. ఇక అవినీతి చట్టం కింద మరో ఏడేళ్ల జైలుశిక్ష విధించారు. ఆ దంపతులకు అదనంగా ఒక్కొక్కరిపై 10 మిలియన్ల జరిమానా కూడా విధించారు. చక్రవర్తి బల్గేరి జ్యులరీ సెట్‌ను ఇమ్రాన్‌కు గిఫ్ట్‌గా ఇచ్చారు. మే 2021 అధికారిక పర్యటన సమయంలో ఆ బహుమతి అందజేశారు. అయితే ఆ ఖరీదైన గిఫ్ట్‌ను ఇమ్రాన్ తక్కువ ధరకే అమ్ముకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఒవకేళ జరిమానా చెల్లించకుంటే అప్పుడు ఇమ్రాన్,బుష్రాలకు అదనపు జైలుశిక్ష విధించే అవకాశాలు ఉన్నాయి. స్పెషల్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు ఇమ్రాన్, బుష్రా లీగల్ బృందాలు పేర్కొన్నాయి. తనపై అక్రమ కేసు పెట్టినట్లు ఇమ్రాన్ వాదించారు.

# ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోంది


**న్యూఢిల్లీ డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చడంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఈ పథకాన్ని నీరుగార్చేందుకు మోదీ ప్రభుత్వం దశాబ్దకాలంగా అనేక ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ఇటీవల ఈ చట్టంలో ఏకపక్షంగా మార్పులు చేయడంతోపాటు దేశంలో కోట్లాదిమంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేసిందని మండిపడ్డారు. ఈ మేరకు సోనియా గాంధీ ఓ వీడియో మెసేజ్ రిలీజ్ చేశారు.సరిగ్గా 20 ఏళ్ల క్రితం మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంటు



ఏకాభిప్రాయంతో ఆమోదించిన విషయాన్ని సోనియా గాంధీ గుర్తుచేశారు. అదో విప్లవాత్మకమైన అడుగు అని.. అత్యంత పేదలు, అణగారినవారి జీవితాలకు ఆ పథకం ఉపాధి మార్గంగా నిలిచిందన్నారు. వలసలు ఆగిపోవడమే కాకుండా, ఉపాధికి హామీ దక్కిందన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు అనుగుణంగా తీసుకొచ్చిన ఆ పథకాన్ని మోదీ ప్రభుత్వం అణచివేసిందని ఆరోపించారు. గడిచిన 11 ఏళ్లుగా గ్రామీణ పేదల ప్రయోజనాలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం.. మహాత్ముడి పేరును తొలగించడమేగాక పథకం స్వరూపాన్నే మార్చిందని సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలాంటి చర్చ లేకుండా, ఎవరినీ సంప్రదించకుండా, విపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చట్టాన్ని మార్చివేయడం దారుణమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడేందుకు లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

## గగన్‌యాన్ మిషన్.. ల్యాండింగ్ పారాచూట్‌లను పరీక్షించిన ఇస్రో



**న్యూఢిల్లీ డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించిన మరో కీలక టెస్ట్‌ను ఇస్రో నిర్వహించింది. క్రూ మాడ్యూల్ ల్యాండింగ్‌కు సంబంధించిన పారాచూట్‌లను విజయవంతంగా పరీక్షించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది తొలి అంతరిక్ష ప్రయాణానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సన్నద్ధమవుతున్నది. 2026లో సిబ్బంది లేకుండా గగన్‌యాన్ మిషన్ చేపట్టనున్నది. దీని కోసం అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నది.కాగా, గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించిన మరో కీలక టెస్ట్‌ను ఇస్రో చేపట్టింది. క్రూ మాడ్యూల్ డిసిలరేషన్ సిస్టమ్ కోసం డ్రోగ్ పారాచూట్‌లపై కీలకమైన పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. డిసెంబర్ 18, 19న చండీగఢ్‌లోని డీఆర్డీవో టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ లాబొరేటరీలోని రైల్ ట్రాక్‌పై ఈ టెస్ట్ చేపట్టింది. రాకెట్ స్లెడ్ సహాయంతో పారాచూట్‌లకు సంబంధించిన ట్రయల్స్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## బంగ్లాదేశ్‌లో హిందూ వ్యక్తిని కొట్టి చంపిన కేసులో ఏడుగురి అరెస్టు



**ఢాకా డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బంగ్లాదేశ్‌లో హిందూ మతానికి చెందిన 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్‌ను కొట్టి చంపిన ఘటన తెలిసిందే. ఆ కేసులో బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం ఏడు మందిని అరెస్టు చేసింది. మిమెన్‌సింగ్ సిటీలో దీపూ దాస్‌ను కొట్టి , ఒంటికి నిప్పు పెట్టి చంపారు. దీపూ చంద్రదాస్ దైవదూషణకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ సిటీలో అతను ఫ్యాక్టరీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. పయనీర్ నిట్ కంపోజిట్ ఫ్యాక్టరీలో అతను కార్మికుడిగా ఉన్నాడు. ఫ్యాక్టరీ లోనే దాస్‌కు వ్యతిరేకంగా ప్రచారం జరిగిందని, దీంతో అక్కడ ఉత్కంఠ వాతావరణం నెలకొన్నదని, తీవ్ర ఆగ్రహానికి గురైన ఓ గుంపు అతనిపై దాడి చేశారని, తీవ్రంగా కొట్టారని, ఆ దాడి వల్ల అతను ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు చెప్పారు. కొట్టి చంపిన తర్వాత ఢాకా-మిమెన్‌సింగ్ హైవే సమీపంలో అతని మృతదేహాన్ని పడేసి దానికి నిప్పు పెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ మాలేక్ తెలిపారు. సోషల్ మీడియా ద్వారా తమకు తన కుమారుడి చావు గురించి తెలిసిందని దీపూ తండ్రి రవిలాల్ దాస్ పేర్కొన్నారు.

## డాక్టర్లు స్వేచ్ఛగా విదేశాలకు వెళ్లవచ్చు..

### కానీ భారత్‌ను నిందించకండి: జేపీ నడ్డా



**లక్నో డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని యువ డాక్టర్లు ఇక ఫిర్యాదు చేయరాదు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. దేశంలో ఉన్న వనరులను, సంస్థలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విదేశాలకు వెళ్లాలనుకుంటున్న యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ విదేశాలకు వెళ్లే నెపంతో దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని నిందలు మోపరాదు అని మంత్రి నడ్డా పేర్కొన్నారు. లక్నోలో కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విదేశాలకు వెళ్లే యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ భారత్‌లో సదుపాయాలు లేవని నిందలు చేయవద్దు అన్నారు. ఇక్కడ ఉన్న సంస్థలను, సదుపాయాల్ని వాడుకోవాలన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ వైద్య వ్యవస్థ పూర్తిగా మారిందన్నారు. దేశంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థల సంఖ్య ఇప్పుడు 23కు పెరిగిందన్నారు.